
బుధవారం 30, అక్టోబర్ 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ

- స్థిరమైన పారిశ్రామికాభివృద్ధికి భాగస్వాములు కావాలి
- శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులకు మంత్రి భరత్ పిలుపు
- నూతన పారిశ్రామిక విధానం 4.0పై సమావేశం

5



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులను రాజ్‌భవన్‌లో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు కలిశారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లిన చంద్రబాబు.. గవర్నర్ దంపతులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల అస్వస్థతకు గురైన గవర్నర్ సతీమణి సమీరా నజీర్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు, భువనేశ్వరి అడిగి తెలుసుకున్నారు. సమీరా నజీర్ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరుకుంటూ.. త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి దంపతులు ఆకాంక్షించారు.

# ఏపీ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ సహకారం

## సంస్థ సీఈఓ సత్య నాదెళ్లతో భేటీలో మంత్రి నారా లోకేష్ వినతి

- డిజిటల్ గవర్నెన్స్‌కు సాంకేతిక సహకారం అందించండి
- అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించండి
- ఒకసారి ఏపీని సందర్శించి, అనుకూలతలను పరిశీలించండి
- సత్య నాదెళ్లకు లోకేష్ ఆహ్వానం
- లోకేష్‌తో ఫోటోలు దిగిన మైక్రోసాఫ్ట్ తెలుగు ఉద్యోగులు

3



## ఏపీలో అడోబ్ ఆర్ అండ్ డి కేంద్రం

ఏర్పాటు చేయాలని సంస్థ సీఈఓకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వినతి

- పెట్టుబడులకు ఏపీ అనుకూలమైన ప్రాంతం
- అమెరికాలో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో భేటీలో మంత్రి లోకేష్

2



## క్రీడా నైపుణ్యానికి ఏపీ హబ్

2

- ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య
- చంద్రబాబును కలిసిన క్రికెటర్ కపిల్‌దేవ్
- రాష్ట్రంలో గోల్ఫ్ కోర్స్‌ల ఏర్పాటుపై చర్చ
- 'ఎక్స్'లో ట్వీట్ చేసిన సీఎం చంద్రబాబు

## యాపిల్ విస్తరణకు ఏపీ అనువైన ప్రదేశం!

- తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి
- మా రాష్ట్రానికి వచ్చి పెట్టుబడుల అవకాశాలను తెలుసుకోండి
- యాపిల్ వైస్ ప్రెసిడెంట్ ప్రియా సుబ్రహ్మణ్యంకు మంత్రి లోకేష్ ఆహ్వానం

4

## డిప్యూటీ సీఎం పవన్‌తో హోం మంత్రి అనిత భేటీ

- లా అండ్ ఆర్డర్, దీపావళి ముందస్తు భద్రతా ఏర్పాట్లపై చర్చ
- పర్యావరణ హిత టపాసులకు పెద్దపీట వేయాలన్న పవన్

7

## భూదొంగల భరతం పట్టండి!

- తెదేపా గ్రీవెన్స్‌లో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి అచ్చెన్న
- అధికశాతం భూకబ్జాల సమస్యలే..
- రైతాంగాన్ని ఆదుకోవాలంటూ వినతులు



- వివరాలు 10లో..

### లోపలి పేజీల్లో..

## పీఎం స్వ నిధి పథకం పేదలకు వరం



- సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపు
- పేదల ఆదాయం రెండింతలు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని వెల్లడి

8

## క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంగా త్వరలో సమగ్ర క్రీడా విధానం

- ప్రతిభకు ప్రోత్సాహం, అత్యుత్తమ శిక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు
- ఆంధ్రా ప్రతిభ అంతర్జాతీయ వేదికలపైనా సత్తా చాటేలా కార్యాచరణ
- ఆడుదాం ఆంధ్రాలో అక్రమాలను వెలికితీసి, బాధ్యులపై చర్యలు
- శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు స్పష్టీకరణ

7

## ప్రకృతి సంపద ప్రజలందరికీ చెందాలి

- ఉచిత ఇసుకలో అక్రమాలను సహించబోం
- మైనింగ్ వ్యవస్థ సంపూర్ణ ప్రక్షాళన
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

8

## ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

- సంక్షేమం, అభివృద్ధి జోడుగుర్రాలుగా సీఎం చంద్రబాబు పాలన
- దీపావళి నుండి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు
- తిరుపతి జిల్లా అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తా
- సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

6

## జగన్ పాలన వెలిగొండకు శాపం

- ధ్వజమెత్తిన మంత్రి నిమ్మల
- సాక్షికి ఇచ్చినన్ని నిధులు కూడా ప్రాజెక్ట్‌కు ఇవ్వలేదు
- పనులు పూర్తికాకుండానే జాతికి అంకితం అంటూ డ్రామాలు
- రెండు దశల్లో ప్రాజెక్ట్ పనులు పూర్తి
- వచ్చే సీజన్‌కు 1.19 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం

9

## సిగ్గుందా.. జగన్?

విద్యుత్ వ్యవస్థను భ్రష్టుపట్టించింది నువ్వే

ప్రజలను ఎన్ని విధాలుగా పీడించావో గుర్తు లేదా?

విద్యుత్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదు నీకు..

జగన్‌పై ధ్వజమెత్తిన మాజీ మంత్రి జవహర్



వివరాలు 11లో..

## రేపటి నుంచే ఉచిత సిలిండర్ల పథకం

సుమారు కోటిన్నరమందికి అమలు

ప్రతి కుటుంబానికి ఏటా రూ.2684 లబ్ధి

మహిళల తరపున ప్రభుత్వానికి థాంక్స్

మాజీ మంత్రి పీతల సుజాత



వివరాలు 11లో..

# క్రీడా నైపుణ్యానికి ఏపీ హబ్

- ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య
- చంద్రబాబును కలిసిన క్రికెటర్ కపిల్‌దేవ్
- రాష్ట్రంలో గోల్ఫ్ కోర్స్‌ల ఏర్పాటుపై చర్చ
- 'ఎక్స్'లో ట్వీట్ చేసిన సీఎం చంద్రబాబు





అమరావతి (చైతన్య రథం): భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా చైర్మన్ కపిల్‌దేవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్నితో కలిసి కపిల్‌దేవ్.. ముఖ్యమంత్రిని కలిశారు. కపిల్‌దేవ్‌తో వివిధ క్రీడాంశాలపై చర్చించిన అనంతరం సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.

'ఈరోజు లెజెండరీ క్రికెటర్ మరియు ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా చైర్మన్ మిస్టర్ కపిల్‌దేవ్, అతని ప్రతినిధి బృందంతో సమావేశం కావడం ఆనందంగా ఉంది. అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్స్ క్లబ్ మరియు అనంతపురం మరియు వైజాగ్‌లలో ప్రీమియర్ గోల్ఫ్ కోర్స్ క్లబ్‌లను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించి, ఆంధ్రప్రదేశ్ క్రీడారంగాన్ని విస్తరించడం గురించి మేము చర్చించాము. ఇది మన యువతలో గోల్ఫ్‌పట్ల మక్కువను పెంపొందిస్తుంది. తదుపరి తరం గోల్ఫ్ క్రీడాకారులను ప్రోత్సహిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా మన పౌరులకు ఇలాంటి మరిన్ని అవకాశాలు, సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా నైపుణ్యానికి నిజమైన హబ్‌గా మార్చడానికి క్రీడా చిహ్నలతో సహకరించడానికి మేము ఎదురుచూస్తున్నాము' అని చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.

### క్రీడలపై సీఎంకు ఆసక్తి ఎక్కువ

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుపై చర్చించారు. సమావేశం అనంతరం కపిల్ దేవ్ మీడియాతో మాట్లాడారు. 'క్రీడలపై సీఎం చంద్రబాబు చాలా ఆసక్తిగా ఉన్నారు. గోల్ఫ్ గురించి ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఇండియన్ గోల్ఫ్ అధ్యక్షుడిగా ఉన్నా. ఎక్కడ భూమి ఇస్తారనేది ప్రభుత్వానిదే నిర్ణయం. స్పోర్ట్స్ సిటీ ఇస్తే చాలా సంతోషిస్తా' అని కపిల్ దేవ్ తెలిపారు. అనంతపురం అమరావతి, విశాఖలో గోల్ఫ్ కోర్సులు పెడతామని కేశినేని చిన్ని తెలిపారు. 'ఏపీ అంబాసిడర్‌గా ఉండాలని కపిల్‌దేవ్‌ను కోరాం. రాష్ట్రంలో గోల్ఫ్ అభివృద్ధి చేయాలనే యోచనలో ఉన్నాం. గోల్ఫ్ డ్రైవింగుకు రేంజ్‌లు సిద్ధం చేస్తాం. తదుపరి సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకుంటాం. ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా ఆడేలా చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ క్రీడాకారులను వెలికి తీస్తాం' అని శివనాథ్ వ్యాఖ్యానించారు.

# ఏపీలో అడోబ్ ఆర్అండ్‌డి కేంద్రం

## ఏర్పాటు చేయాలని సంస్థ సీఈఓకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వినతి




- స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ-డ్రైవెన్ సొల్యూషన్స్‌లో భాగస్వామ్యం వహించండి
- యువతలో డిజిటల్ నైపుణ్యాల మెరుగుదలకు సహకారం అందించండి
- పెట్టుబడులకు ఏపీ అనుకూలమైన ప్రాంతం
- అమెరికాలో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో భేటీలో మంత్రి లోకేష్

శాన్‌ఫ్రాన్సిస్కో (యుఎస్ఏ): రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన అవిశ్రాంతంగా కొనసాగుతోంది. తాజాగా శాన్‌ఫ్రాన్సిస్కోలో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో భేటీ అయిన లోకేష్... ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోంది, ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పెట్టుబడులకు అన్నివిధాల అనుకూలమైన ప్రాంతమని చెప్పారు. శంతను నారాయణ్ మాట్లాడుతూ... అడోబ్ కంపెనీ ప్రస్తుతం డిజిటల్ మీడియా, క్లౌడ్-ఆధారిత సేవల్లో అగ్రగామిగా ఉందన్నారు. ఫోటోషాప్, అక్రోబాట్, ఇల్లస్ట్రేటర్ వంటి సాధనాలను మరింత అందుబాటులోకి తెచ్చాం. సృజనాత్మకత, డాక్యుమెంట్ ఉత్పాదకత, ఏఐ-పవర్డ్ ఇన్నోవేషన్స్ రంగంలో ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్ వెర్షన్స్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. ఈ ఏడాది అక్టోబర్ నాటికి తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా రూ.17.95లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ కలిగి ఉందని చెప్పారు.

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఇన్నోవేషన్ అండ్ గ్రోత్ విజన్‌తో మీరు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విజన్‌తో సరిపోతుందన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా సృజనాత్మక, వ్యాపార సాధనాల్లో అడోబ్ సేవలు ప్రశంసనీయం. ఏపీలో ఇ-గవర్నెన్స్‌ని సమగ్రపర్చడం, గ్లోబల్ టెక్‌హబ్‌గా మార్చడానికి మీవంతు సహకారం అందించండి. ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. డిజిటల్ విద్యా ప్లాట్‌ఫారమ్‌ల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను ఏకీకృతం చేయడంలో మీ భాగస్వామ్యాన్ని కోరుతున్నాం. ఏపీలో అడోబ్ ఆర్ అండ్ డి (పరిశోధన, అభివృద్ధి) కేంద్రాన్ని ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్‌లో యువతను డిజిటల్ నైపుణ్యాలతో శక్తివంతం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నాం. డిజిటల్ ఎడ్యుకేషన్‌ను మెరుగుపర్చడంలో భాగంగా డిజిటల్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫారమ్‌లను రాష్ట్రానికి తీసుకురావడానికి అడోబ్ తరపున సహకారం అందించండి. డాక్యుమెంట్ ప్రొడక్టివిటీ, ఏఐ పవర్డ్ టూల్స్‌లో అడోబ్ నైపుణ్యం మాకు ఎంతగానో ఉపకరిస్తుంది.

డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, పబ్లిక్ సర్వీస్‌లను క్రమబద్ధీకరించడం, ప్రభుత్వ ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి, స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ-డ్రైవెన్ సొల్యూషన్స్ అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి పనిచేయండి. ప్రభుత్వం, పరిశ్రమల వినియోగానికి సంబంధించి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ప్రభుత్వ కార్యకలాపాలు, పౌరసేవల్లో క్లౌడ్ ఇంటిగ్రేషన్‌కు అడోబ్ భాగస్వామ్యం వహించే అంశాన్ని పరిశీలించండి. ప్రభుత్వ సేవలు, స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌ల్లో అడోబ్ ఏఐ ఆధారిత సేవలు, సృజనాత్మకత, డిజిటల్ అనుభవం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతగానో ఉపయోగపడతాయి. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, స్టార్టప్‌లకు అడోబ్ అందించే సృజనాత్మక సాధనాలు ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి దోహదపడతాయి. ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాలని లోకేష్ కోరారు. మంత్రి చేసిన ప్రతిపాదనలపై శంతన్ నారాయణ్ స్పందిస్తూ... కంపెనీలోని సహచరులతో చర్చించి ఏపీలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.



చైతన్యరథం

# ఏపీ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ సహకారం

## సంస్థ సీఈఓ సత్య నాదెళ్లతో భేటీలో మంత్రి నారా లోకేష్ వినతి



- డిజిటల్ గవర్నెన్స్‌కు సాంకేతిక సహకారం అందించండి
- అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించండి
- ఒకసారి ఏపీని సందర్శించి, అనుకూలతలను పరిశీలించండి
- సత్య నాదెళ్లకు లోకేష్ ఆహ్వానం
- లోకేష్‌తో ఫోటోలు దిగిన మైక్రోసాఫ్ట్ తెలుగు ఉద్యోగులు

రెడ్‌మండ్ (యుఎస్ఏ): ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో అమెరికాలోని రెడ్‌మండ్‌లో ఉన్న సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్‌లో పనిచేసే తెలుగు ఉద్యోగులు లోకేష్‌తో ఫోటోలు దిగారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సత్య నాదెళ్ల తన అపారమైన మేధస్సుతో అంచెలంచెలుగా ఎదిగి మైక్రోసాఫ్ట్ సీఈఓ స్థాయికి చేరుకున్నారు. సత్య నాదెళ్ల తండ్రి బీఎన్ యుగంధర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐఏఎస్ అధికారిగా గ్రామీణ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు విశేషంగా కృషిచేశారు. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో లోతైన ఆసక్తి కలిగిన సత్య నాదెళ్ల 2014 నుంచి మైక్రోసాఫ్ట్ సీఈఓగా ఆ సంస్థ పురోభివృద్ధికి కృషిచేస్తున్నారు.





లోకేష్‌తో భేటీ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ... మైక్రోసాఫ్ట్ సంస్థ సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఉందని చెప్పారు. అక్టోబర్ 2024 నాటికి మైక్రోసాఫ్ట్ 3.1 ట్రిలియన్ల డాలర్ల మార్కెట్ క్యాప్ కలిగి ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా ఉందన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ దాని క్లౌడ్ సేవలు, ఏఐ -డ్రివెన్ సొల్యూషన్ రంగంలో బలమైన వృద్ధితో 211.9 బిలియన్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జించిందని తెలిపారు.

### ఐటి హబ్‌లకు సహకారం అందించండి

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో హైదరాబాద్ నగరం ఐటి హబ్‌గా రూపుదిద్దుకున్న విషయం మీకు తెలుసునన్నారు. ప్రస్తుతం 4వ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఏపీని టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఐటీ హబ్‌లు, ఇన్నోవేషన్ పార్కులను నిర్మిస్తున్నాం. ఈ హబ్‌లను ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో మైక్రోసాఫ్ట్ సహకారం అవసరం. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్‌ల ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి సంస్థలకు ప్రాంతీయ కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. అటువంటి పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, అవసరమైన భూమి మావద్ద అందుబాటులో ఉన్నాయి. క్లౌడ్ సేవల్లో మైక్రోసాఫ్ట్ నాయకత్వంతో కలిసి మేము అత్యాధునిక సాంకేతిక పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని భావిస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.

### ఏపీలోని ఐటి టాలెంట్‌పై దృష్టి సారించండి

ఏపీ రాష్ట్రం అత్యుత్తమ ఐటీ, ఇంజనీరింగ్ ప్రతిభావంతులను తయారుచేసే బలమైన విద్యావ్యవస్థను కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ఐటి నిపుణులు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గణనీయమైన సేవలు అందిస్తున్న విషయం మీకు తెలుసు. ఏపీలో ఐటీ, ఇంజనీరింగ్ టాలెంట్‌పై దృష్టి సారించాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక. అగ్రిటెక్‌కు ఏఐని అనుసంధానించడం వల్ల మన రాష్ట్ర వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. మైక్రోసాఫ్ట్ సాంకేతిక నైపుణ్యంతో ఉత్పాదకతను పెంచే వ్యవసాయ విధానాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా స్ట్రీమ్‌లైన్డ్ అప్రూవల్స్, ఫాస్ట్-ట్రాక్ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్, ప్రో-బిజినెస్ పాలసీలతో ఆంధ్రప్రదేశ్ వ్యాపార, వాణిజ్యరంగాలకు వేగవంతమైన సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఏపీలో సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు, డిజిటల్ గవర్నెన్స్ వ్యూహాత్మక లాజిస్టిక్‌లకు అనువుగా ఉంటాయి. దీనికి బలమైన పర్యావరణ వ్యవస్థ మద్దతుగా నిలుస్తుందని మంత్రి లోకేష్ వివరించారు.

### ఏఐ క్యాపిటల్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం

క్లౌడ్-ఆధారిత ప్లాట్‌ఫాంలను అమలు చేయడం, డేటా అనలిటిక్స్ కోసం ఏఐని ఉపయోగించడం, సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం, స్మార్ట్ సిటీ కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించే డిజిటల్ గవర్నెన్స్ విధానాలకు మైక్రోసాఫ్ట్ సహకారాన్ని కోరుతున్నాం. ఏఐ ప్రాజెక్టులకు అనువుగా ఉన్న అమరావతిని ఏఐ క్యాపిటల్ గా తయారు చేయాలని భావిస్తున్నాం. ఇందులో భాగంగా అమరావతిలో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డైనమిక్ టెక్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆవిష్కరణల కోసం ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాల్సిందిగా కోరుతున్నాం. ఏపీలో నెలకొన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పర్యావరణ వ్యవస్థను ఒకసారి మా రాష్ట్రానికి వచ్చి పరిశీలించండి. ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాల గురించి తెలుసుకోండి. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రణాళికల్లో అధునాతన సాంకేతికను ఏకీకృతం చేయడానికి భాగస్వామ్యం వహించాల్సిందిగా మైక్రోసాఫ్ట్ సీఈఓను మంత్రి లోకేష్ కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సత్య నాదెళ్ల.. ఏపీలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ రంగాల అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృంద సభ్యులు కార్తికేయ మిశ్రా, సాయికాంత్ వర్మ పాల్గొన్నారు.





### అనేక అంశాలపై లోతైన చర్చ: లోకేష్

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో సమావేశంపై మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై లోతైన చర్చ జరిపామన్నారు. రాష్ట్రంలో ఐటీ, ఏఐ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల అమలుకు సత్య నాదెళ్ల మార్గదర్శకాన్ని, మద్దతును కోరామన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో, అవకాశాల సద్వినియోగంలో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నామన్నారు.

# ఐదేళ్లలో జగన్‌రెడ్డి ఒక్క పోర్టు అయినా పూర్తిచేశారా?

- సంపద సృష్టి అంటే రూ.11 లక్షల కోట్ల అప్పా?
- విధ్వంస పాలనతో భ్రష్టు పట్టించి నీతులు చెబుతారా?
- కూటమి ప్రభుత్వంలో శరవేగంగా పోర్టుల నిర్మాణం
- తీరప్రాంత అభివృద్ధి కోసం పెద్దఎత్తున ప్రాజెక్టులు
- మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తిచేసి చూపిస్తాం
- గృహనిర్మాణ, ఐపీఆర్ మంత్రి కొలుసు పార్థసారథి




అమరావతి(చైతన్యరథం): సంపద సృష్టి అటుంచి రాష్ట్రాన్ని ఐదేళ్లలో విధ్వంసం వైపు తీసుకెళ్లిన వైసీపీ నేతలు ఇప్పుడు నీతులు వల్లించడం హాస్యాస్పదంగా ఉందని గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. ఐదేళ్లలో రాష్ట్రానికి సాధించిందేమి లేదు.. రూ.11 లక్షల కోట్ల అప్పు తప్ప అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పోర్టుల నిర్మాణం కోసం పట్టుదలగా ఉందని, 2025 డిసెంబరుకు బందరు పోర్టు నిర్మాణం పూర్తి అవడం ఖాయమని తెలిపారు. తమ ప్రభుత్వ ప్రయత్నాల గురించి కేంద్రమంత్రి సోనోవాల్ స్వయంగా పార్లమెంటులో ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. మీ హయాంలో ఒక్క చిన్న పోర్టు పని అయినా అయిందా? అని ప్రశ్నించారు. ఆరు పెద్ద పోర్టుల పనులు వేగంగా పుంజు కున్నాయి.. నాలుగు కొత్త పోర్టులు సిద్ధమవుతున్నాయి.. తీరప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. నాలుగు కొత్త ఓడ రేవుల నిర్మాణం వేగవంతం కావడం, ప్రస్తుతం ఉన్న ఆరు ఓడరేవుల నుంచి ఎగుమతులు గణనీయంగా పెరగడంతో రాష్ట్రం మెరైన్ లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. నాలుగు కొత్త పోర్టులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. రూ.2,123 కోట్లతో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)కి అప్పగించిన కాకినాడ సెజ్ పోర్టు అభివృద్ధి ప్రాజెక్టులో డ్రెడ్జింగ్,బ్రేక్ వాటర్ రివిట్‌మెంట్, బెర్తులు, పోర్టు భవనాలు, రోడ్లు, రైల్వేలైన్, పోర్ట్ క్రాఫ్ట్ బెర్త్ తదితర సౌకర్యాలను కల్పించారు. నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టును రూ.3,736 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో రూ.5,155 కోట్లతో చేపట్టిన మచిలీపట్నం పోర్టు అభివృద్ధి ప్రాజెక్టు మొదటి దశ, శ్రీకాకుళం జిల్లాలో రూ.4,362 కోట్లతో మూలపేట పోర్టు (గతంలో భావనపాడు పోర్టు) అభివృద్ధి ప్రాజెక్టు పనులు కూడా కొనసాగుతున్నాయి. సాగరమాల ప్రాజెక్టు కింద కాకినాడ యాంకరేజ్ పోర్టులో రూ.91కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.సాగర్‌మాల నుంచి సుమారు రూ.43కోట్లు, ఏపీఎంబీ నుంచి రూ.48కోట్లు వస్తున్నాయి. మొదటి దశలో రూ.1,523 కోట్లతో నాలుగు ఫిషింగ్ హార్బర్లు, రూ.1,595 కోట్లతో రెండో దశలో ఆరు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి పెట్టుబడులు పెడుతున్నట్లు తెలియదా? అని ప్రశ్నించారు. ఓడరేవుల అభివృద్ధి, తీరప్రాంత బెర్తులు సహా వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రం నుంచి రూ.3,300 కోట్ల విలువైన 29కొత్త ప్రతిపాదనలు పోర్టులు, షిప్పింగ్, జల రవాణా మంత్రిత్వ శాఖకు అందాయని స్వయంగా కేంద్రమంత్రి సోనోవాల్ పార్లమెంటుకు తెలిపిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. వీటిలో రో-పాక్స్, ప్యాసింజర్ జెట్టీలు, ఫిషింగ్ హార్బర్లు, పోర్టుల ఆధునికీకరణ, నైపుణ్యాభివృద్ధి తదితర ప్రాజెక్టులు ఉన్నాయని, ఈ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం మంత్రిత్వ శాఖ ఇప్పటికే రూ.450కోట్లు మంజూరు చేసిందని సోనోవాల్ చెప్పారన్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) సంయుక్తంగా రూ.4,600 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో 36 ప్రాజెక్టులను చేపట్టాయని తెలిపారు.

### 2025 డిసెంబరు నాటికి బందరు పోర్టు పూర్తి

మచిలీపట్నం పోర్టు నిర్మాణం 2025 డిసెంబర్ నాటికి పూర్తవుతుంది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మచిలీపట్నంలో పోర్టు పనులను పరిశీలించారు. రాజధాని అమరావతికి దగ్గరగా ఉన్న దృష్ట్యా ఈ పోర్టును 'క్యాపిటల్ పోర్టు'గా అభివృద్ధి చేయడం మా ప్రభుత్వ విజన్‌కు సంకేతం.

మచిలీపట్నం మంగిన పూడి వద్ద సుమారు 1,145 ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులను 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించగా, వైసీపీ ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టింది. కానీ కూటమి ప్రభుత్వం పోర్టులను పూర్తి చేసి చూపిస్తుందని స్పష్టంచేశారు.సంపద సృష్టించడం ఎలాగో చూడండి.. మేం త్వరలో మెడికల్ కాలేజీలు కూడా పూర్తిచేసి చూపిస్తామని తెలిపారు. మీది ఆరంభ శూరత్వం.. మాది పనిచేసే మంచి ప్రభుత్వం.. ప్రజలకు మీరే సమాధానం చెప్పుకోవాలి.. సిద్ధంగా ఉండాలి మరి అని హితవు పలికారు.

# పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ

- స్థిరమైన పారిశ్రామికాభివృద్ధికి భాగస్వాములు కావాలి
- ఉద్యోగాల కల్పన, సుస్థిర వృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం
- పాలసీ క్రమబద్ధీకరణలో మీ అభిప్రాయాలు కీలకం
- శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులకు మంత్రి భరత్ పిలుపు
- నూతన పారిశ్రామిక విధానం 4.0పై సమావేశం



శ్రీసిటీ(చైతన్యరథం): నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంలో భాగస్వామ్యులు కావాలంటూ పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి మంత్రి టి.జి.భరత్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీసిటీ పరిశ్రమల ప్రధాన కార్యనిర్వాహకులు (సీఈవోలు), ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానం-4.0 తీరు తెన్నుల గురించి వివరించారు. నూతన పారిశ్రామిక విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా కార్యాచరణను అమలు చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విధానంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎంఈ), ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి,పర్యావరణ హరిత శక్తి, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. వేగం, సామర్థ్యం, సుస్థిరత ద్వారా ఆర్థిక పరివర్తన సాధించే ప్రాథమిక సూత్రాలతో పారిశ్రామిక పాలసీ రూపకల్పన చేయబడిందని తెలిపిన ఆయన సుస్థిర పారిశ్రామిక అభివృద్ధిని పెంపొందించుకుం టూ ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిం చాలన్న ప్రభుత్వ దృక్పథాన్ని వివరించారు. పాలసీ క్రమబద్ధీకరణలో వ్యాపారవేత్తల సూచనలు, ఆలోచనలు కీలకమని.. పరిశ్రమల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు.

### వేగవంతమైన వ్యాపార విధానం లక్ష్యం

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంలో వేగవంతమైన వ్యాపార విధానం కోసం తీసుకువస్తున్న వివిధ నిర్ణయాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పరిశ్రమల కోసం మౌలిక సదుపాయాలు,ప్రోత్సాహకాల గురించి వివరించారు.ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల (పీఐపీ) కోసం బహుళ-స్థాయి పెట్టుబడి ఫ్రేమ్‌వర్క్‌తో ఆంధ్రప్రదేశ్ నూతన పారిశ్రామిక విధానం ప్రత్యేకంగా తీర్చిదిద్ద బడిందన్నారు. ఈ విధానం సైజు(నానో నుంచి మెగా) వారీగా పార్క్‌లను వర్గీకరించడంతో పాటు వివిధ పెట్టు బడి శ్రేణులకు (సబ్‌లార్జ్,లార్జ్, మెగా) ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో గణనీయమైన పెట్టు బడులను ఆకర్షించడం, ఉద్యోగాలను సృష్టించడం, ఆర్థిక వృద్ధిని పెంచడం రాష్ట్రం లక్ష్యంలో భాగంగా వివరించారు. ప్రత్యేకంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, పర్యావరణ స్నేహ పూర్వక విద్యుత్, ఎలక్ట్రానిక్స్, ఆహారశుద్ధి రంగాలకు అధిక ప్రోత్సాహకాలు, 40 శాతం వరకు సబ్సిడీలు, 6 శాతం డీకార్బనైజేషన్ సబ్సిడీ, వ్యాపార నిర్వహణలో తక్కువ సమయంలో సౌల భ్యాలను కల్పించడం ఈ విధానంలో కీలకంగా ఉన్నాయని తెలిపారు. అంతేకాక ఎగుమతుల లక్ష్యాన్ని 40 బిలియన్ డాలర్లకు పెంచేందుకు ఆటోమోటివ్, ఔషధం, అంతరిక్ష రంగాలలో ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" నినాదంతో రాష్ట్రంలో 175 ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక పార్కులు,ఎంఎస్ఎంఈలు, ఎలక్ట్రానిక్స్ కోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ కల్పన, సుస్థిర వృద్ధిని సాధించడం ప్రభుత్వ లక్ష్యంలో భాగమన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పరిశ్రమల కోసం ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తూ దీని ద్వారా స్థిరమైన పారిశ్రమాభివృద్ధిని సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### నూతన పారిశ్రామిక విధానానికి ప్రశంసలు

శ్రీసిటీ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, నూతన పారిశ్రామిక విధానాన్ని హర్షిస్తూ ముఖ్యంగా పనులు వేగవంతంగా సాగేలా చేసే (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) విధానానికి ప్రశంసలు తెలిపారు. ఎంఎస్ఎం ఈలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు ఉద్దేశించిన ప్రోత్సాహకా లను అభినందిస్తూ పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను త్వరగా రీయింబర్స్‌మెంట్ చేయాలని అభ్యర్థించారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలను పరిష్క రించడానికి, ఫిర్యాదుల పరిష్కారానికి విధాన సౌలభ్యంపై వారు ప్రస్తావించారు. శ్రామికశక్తి ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వృత్తి శిక్షణ కార్య క్రమాలలో పెట్టుబడిని పెంచాలని సూచించారు. శ్రీసిటీ పారిశ్రామిక వర్గానికి నూతన పారిశ్రామిక విధానం దాని ముఖ్య అంశాలను వివరి స్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినందుకు మంత్రి, కార్యదర్శికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ చొరవ ప్రపంచ పెట్టుబడులకు రాష్ట్రాన్ని ప్రధాన గమ్యస్థానంగా మార్చడంలో ప్రభుత్వ చురుకైన విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా మంత్రి, పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీసిటీలోని వివిధ అభివృద్ధి కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. డైకిన్ ఇండియా పరిశ్రమను సందర్శించి ఉత్పత్తి ఇతర అంశాలను ఆరాతీశారు.

చైతన్యరథం

# ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

- సంక్షేమం, అభివృద్ధి జోడుగుర్రాలుగా సీఎం చంద్రబాబు పాలన
- దీపావళి నుండి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు
- తిరుపతి జిల్లా అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తా
- సమీక్షలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్




తిరుపతి (చైతన్యరథం): సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం అన్నారు. తిరుపతి జిల్లా అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం తిరు పతి కలెక్టరేట్‌లో జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడులతో కలిసి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్, కొరుగొండ్ల రామ కృష్ణ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తదితర ప్రజా ప్రతి నిధులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా ప్రగతిపై కలెక్టర్ వెంకటేశ్వర్, శాంతి భద్రతలపై ఎస్పీ సుబ్బరాయుడు వివరించగా పలువురు ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి మార్గదర్శనంలో తిరుపతిజిల్లాలో అమల వుతున్న ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలపై, శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించామన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి కొలువైన జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి గా రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సంక్షే మం,అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలనే విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే మొదటగా మెగా డీఎస్సీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సస్.. ఐదు ఫైళ్లపై సంతకం పెట్టారని మంత్రి అనగాని గుర్తు చేశారు. దీపావళి నుండి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు.

## రోజుకో మంచి పని

మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయనున్నారన్నారు. రూ.4 వేలకు పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను ఒకటో తారీఖున లబ్దిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామన్నారు. తిరుపతి జిల్లాలో అధికారులు సమన్వయంతో చక్కగా పెన్షన్ల పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రతి పేద వాడికి కడుపు నిండా మూడు పూటలా భోజనం పెట్టాలనే సదుద్దేశంతో రూ.5 కే పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామన్నారు. పాలన చేపట్టిన 130 రోజుల్లో రోజుకు ఒక మంచి పని చేసేలా మంచి పథకాలు అందిస్తూ రోజుకు ఇరవై గంటలు ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టపడి పని చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం 15 సంవత్సరాలు వెనక్కు వెళ్ళిపోయిందన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నార న్నారు. దేశంతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాత సంస్థలు ఇప్పుడు పెట్టుబడులు పెట్టేందుకు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు మీద ఉన్న నమ్మకం అలాంటిద న్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047తో రాబోయే 23 సంవత్సరాలకు ప్రణాళిక వేసుకుని మన రాష్ట్రం అగ్ర స్థానంలో ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నామని మంత్రి అనగాని తెలిపారు.

### ఉచిత ఇసుకపై అపోహలు వద్దు

ప్రజలకు ఇసుక భారం కాకూడదని ఉచిత ఇసుక పాలసీ తెచ్చామన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం ఆశించకుండా ప్రజలకు ఉచిత ఇసుక అందించే దిశలో ముఖ్యమంత్రి అనేక మార్గదర్శకాలు రూపొందించారన్నారు. ఇసుకపై సీనరేజి కూడా తీసేసారని, ఇసుక అక్రమ రవాణా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇసుక రీచ్‌ల్లో సీసీ కెమెరాల ద్వారా పటిష్ట నిఘా ఉండాలని సూచించారు. ఉచిత ఇసుక పాలసీపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. పేదలకు అందుబాటులో ఇసుక ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉండే ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో వారి స్వంత అవసరాలకు తీసుకెళ్లడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో గత నాలుగు నెలల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యాయన్నారు. శ్రీసిటీలో పలు పరిశ్రమలను సీఎం చంద్రబాబు ప్రారంభించారన్నారు. మరికొన్నింటికి భూమి పూజ చేశారని గుర్తు చేశారు.

## పర్యాటకంగా అభివృద్ధి

తిరుపతి జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులు, ఇతర అవసరాల నిమిత్తం వచ్చే వారు కలిపి సుమారు లక్ష మంది ప్రతి రోజు తిరుపతి జిల్లా సందర్శిస్తున్నారన్నారు. ఆతిథ్య రంగం, పర్యాటకపరంగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయన్నారు. పులికాట్ సరస్సు ముఖద్వారం దగ్గర పూడిక తీసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## ఫ్రీ హోల్డ్ పేరుతో అక్రమాలు

గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ పేరుతో పేదవారి భూములను కొందరు పెద్దలు స్వాధీనం చేసుకు న్నారని, తిరుపతిజిల్లాలో కూడా ఇలాంటికేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫ్రీ హోల్డ్ చేసిన భూముల రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్, సర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా పూర్తి కాలేదని, మరో 15రోజులు పొడిగించి ఈ నెల 15నాటికి ముఖ్యమంత్రికి నివేదించి తదు పరి చర్యలు చేపడతామని తెలిపారు. ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగిన జిల్లాల్లో తిరుపతి జిల్లా కూడా ఉందన్నారు. జిల్లాలో వెరిఫికేషన్ ప్రక్రియపై 7గురు డిప్యూటీ కలెక్టర్లు పనిచేస్తు న్నారన్నారు.అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు విలువైన సూచన లు ఇచ్చారని, ఇకపై క్రమం తప్పకుండా సమా వేశాలు నిర్వహిస్తామని తెలిపారు.జిల్లాను ప్రగతి లో నడిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి అనగాని తెలిపారు.

## గంజాయిపై ఉక్కుపాదం

గంజాయిని అరికట్టడానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఆ దిశగా పోలీసు, సంబంధిత శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి మూలాలపై ఎక్కడికక్కడ దాడులు నిర్వహించాలన్నారు.

## విద్యుత్ చార్జీలపై అసత్య ప్రచారం

విద్యుత్ చార్జీల సర్దుబాటుపై వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ తప్పుడు విధానాలే ఈ పరిస్థితికి కారణమన్నారు. విద్యుత్ చార్జీలు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. గతంలో 2014-19లో మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామన్నారు. చార్జీలు పెంచకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించామన్నారు. వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని మంత్రి అనగాని విమర్శించారు.

## గ్రామాల అభివృద్ధి ధ్యేయం

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలను అభివృద్ధిలో భాగస్వాములను చేసి 4500 కోట్ల రూపాయల ప్రణాళికలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వచ్చే జనవరి నాటికి ఆర్ అండ్ బీ రోడ్లకు మరమ్మతులు పూర్తిచేసి, గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతామన్నారు. (ఈ మేరకు పనులు ప్రారంభమయ్యాయన్నారు. అలాగే పల్లె పండుగ కింద గ్రామీణ రహదారులు బాగు చేయటంతో పాటు, కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు.
ఇన్‌ఛార్జి మంత్రిగా అన్ని శాఖలకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు ఉన్నా వాటిని సరిదిద్ది, అన్ని విధాలుగా తిరుపతి జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, మంచి సమాజం ఏర్పాటుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

### కుటుంబ వివాదాన్ని టీడీపీకి ఆపాదిస్తారా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కుటుంబ ఆస్తుల వివాదాన్ని టీడీపీకి ఆపాదించడం దారుణమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి అనగాని అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆస్తి గొడవలను షర్మిల బయటపెడితే తమపై విమర్శలు చేయటమేమిటని ప్రశ్నించారు. వైసీపీ పార్టీ పుట్టిందే అబద్ధాల పునాది మీద అని విమర్శించారు. అందుకే వైసీపీ నేతలు అబద్ధాలను నిజం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం ఏపీలో సుభిక్షమైన పాలన కొనసాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు 130 కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ఈ కార్యక్రమాలు విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.
ఇక శ్రీవారిని దర్శించుకోవడానికి వెళ్లిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పండితులు ఆలయ మర్యాదల ప్రకారం తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందించారు.





# ప్రకృతి సంపద ప్రజలందరికీ చెందాలి

- ఉచిత ఇసుకలో అక్రమాలను సహించబోం
- మైనింగ్ వ్యవస్థ సంపూర్ణ ప్రక్షాళన
- అక్రమాలకు తావు లేకుండా మద్యం విధానం అమలు
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

విశాఖపట్నం (చైతన్యరథం): ప్రకృతి ప్రసాదించిన వనరులు ప్రతి ఒక్కరికీ చెందేలా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విశాఖపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహకులతో మంగళవారం మంత్రి రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ నిర్వాహకుల సూచనల మేరకు కొత్త పాలసీ రూపొందించబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి మైనింగ్ నిర్వాహకుడూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బాధితుడేనన్నారు. అడ్డగోలు నిబంధనలతో ప్రగతి పథంలో నడపాల్సిన మైనింగ్ వ్యవస్థను అధ్వాన్నంగా తయారు చేశారు. అధికారం శాశ్వతం అనే మత్తులో వ్యవస్థల్ని భ్రష్టుపట్టించారు. అధికారుల్ని అడ్డగోలుగా వాడుకున్నారు. రాష్ట్రం ఏమైపోయినా పర్లేదని, తమ జేబులు నిండితే చాలు అనేలా వ్యవహరించారు. గత ఐదేళ్లు మైనింగ్ వ్యవస్థలో ప్రతి స్థాయిలోనూ కొంత మంది రాజకీయ ప్రమేయంతో దోచుకున్నారు. విశాఖ నగరంలో అభివృద్ధిని గాలికొదిలేసి మరీ దోపిడీలకు తెరలేపారు. పెనాల్టీల నుండి ఐడీలు బ్లాక్ చేయడం వరకు అనేక రకాలుగా వ్యాపారస్తుల్ని వేధించారు. తర్వాత వాటిని కబ్జా చేశారు. బెదిరింపులకు దిగారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపారానికి ఎవరైనా ముందుకొస్తారా? కోట్లలో పెనాల్టీలు వేస్తే వ్యవస్థలు ఎలా నడుస్తాయనే ఇంగితం లేకుండా వ్యవహరించారని మంత్రి రవీంద్ర తప్పుపట్టారు.

### సీఎం చంద్రబాబు నేతృత్వంలో పాలన పరుగులు

కానీ, ప్రస్తుతం విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు పాలనలో రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. అధ్వాన్నంగా మారిన వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసేలా అడుగులు వేస్తున్నాం. గతంలో విజన్ 2020 అంటే అందరూ నవ్వుకున్నారు. కానీ దాని ఫలాలు ఎంత గొప్పగా ఉన్నాయో నేడు హైదరాబాద్‌ను చూస్తే అర్థమవుతోంది. ఇప్పుడు కూడా



2047- విజన్ ప్రకటించిన వెంటనే ప్రధాన మంత్రి కూడా వికసిత్ భారత్ అని ప్రకటించి అభివృద్ధికి తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. వేగం, నాణ్యత ప్రామాణికంగా పాలనకు శ్రీకారం చుట్టాం. వచ్చే 20 సంవత్సరాల్లో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. అందుకే అధికారులు, క్వారీల నిర్వాహకులతో సమీక్షలు నిర్వహించి సమస్యలు తెలుసుకుంటున్నామని మంత్రి రవీంద్ర తెలిపారు.

### ప్రకృతి వనరులు సద్వినియోగం చేసుకోవాలి

మైనింగ్ వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసి మెరుగైన పాలనకు శ్రీకారం చుట్టబోతున్నాం. గత ఐదేళ్లు కూడా డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) విషయంలో ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. ఇప్పుడు దాన్ని స్థానిక అవసరాలకు వినియోగించేలా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాం. అదే సమయంలో క్రషర్ యజమానులు, మైనింగ్ కంపెనీల యజమానులతో సీనరేజి వసూలు చేసే సంస్థలు సఖ్యతతో నడచుకోవాలని ఆదేశించాం. పెత్తనం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోం. రాష్ట్ర ఆదాయం పెంచాలి. ప్రకృతి వనరులను పరిరక్షించాలి. ఉత్తరాంధ్రలో అమూల్యమైన ప్రకృతి వనరులున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే.. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలతో రాష్ట్రం వెలిగిపోతుంది. అందుకు అధికారులు కూడా సహకరించాలి. గత ఐదేళ్లు అడ్డగోలు ఆదాయం కోసం ప్రయత్నించిన అధికారులు కూడా మారాలని మంత్రి రవీంద్ర హితవు పలికారు.

### ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ఇసుక

ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలనే లక్ష్యంతో జులై 8న పాలసీ ప్రకటించినా.. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఎన్జీటీలో కేసులు నడుస్తున్నాయి. ఫలితంగా తవ్వకాలు చేయలేకపోయాం. మరోవైపు వరుసగా కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. దాన్ని చిలువలు పలువలు చేస్తూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి. ఇప్పటికే 108 ఇసుక రీచులు తెరిచాం. అవసరమైన మేర ఇసుక అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా సీనరేజి, జీఎస్టీని కూడా రద్దు చేసి మరీ ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నాం. విశాఖపట్నం, అనకాపల్లిలో ఇసుక కొరతను నివారించేందుకు గోదావరి జిల్లాల్లో ఐదు రీచుల్ని ప్రత్యేకంగా కేటాయించాం. ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. ప్రకృతి వనరులన్నీ ప్రజలకు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. నిర్మాణ రంగానికి పూర్వ వైభవం తెస్తామని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు.

### అక్రమాలకు తావు లేకుండా మద్యం పాలసీ

ఆంధ్రా యూనివర్సిటీలోని ఎక్సైజ్ శాఖ ల్యాబరేటరీని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేసిన లేబరేటరీలో ఉన్న అత్యాధునిక పరీక్షా విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ క్రోమోటో గ్రఫీ, అటమిక్ అబ్‌జార్ప్షన్ స్పెక్ట్రో స్కోపీ, హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రమోటోగ్రఫీ యంత్రాల పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యాన్ని 9 రకాలుగా పరీక్షిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ గత పాలనలో ఎలాంటి పరీక్షలు చేయకుండా ప్రజలపై మద్యాన్ని రుద్ది వారి ప్రాణాలు తీశారని విమర్శించారు. మద్యం తయారీలో వాడుతున్న ముడి పదార్థాలను ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకునేలా ల్యాబ్ ఏర్పాటు చేశాం. ప్రజలకు అందించే మద్యం గురించి ఎలాంటి అపోహలు లేకుండా చేసేందుకే ఈ ల్యాబ్ ఏర్పాటుచేశాం.గత పాలకులు మద్యం వ్యాపారంలోకి దిగి వ్యవస్థలన్నింటిని నాశనం చేశారు. కల్తీ బ్రాండ్ల కారణంగా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యంలో ఎలాంటి ప్రాణాంతక రసాయనాలు లేకుండా చూడటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. జగన్ రెడ్డి తెచ్చిన కల్తీ మద్యం కారణంగా లక్షలాది మంది ఇప్పటికీ ఆస్పత్రుల్లో ప్రాణాలతో పోరాడుతున్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా మద్యం పాలసీని అమలు చేసి తీరుతాం. ఎంఆర్పీ ఉల్లంఘనలు, అక్రమ అమ్మకాలు, బెల్టు షాపుల ఏర్పాటును ఏ మాత్రం ఉపేక్షించబోమని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# పీఎం స్వ నిధి పథకం పేదలకు వరం

## - సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపు

- పథకం అమలులో ఉత్తమ పనితీరు కనపరిచిన అధికారులు, బ్యాంకర్లకు అభినందనలు
- అవార్డులు ప్రదానం చేసిన మంత్రి
- పేదల ఆదాయం రెండింతలు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని వెల్లడి






అమరావతి (చైతన్యరథం): పేదలంతా పీఎం స్వ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ పిలుపు ఇచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన పీఎం స్వ నిధి పథకం రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఇంకా ఎక్కువ అవార్డులు సాధించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. కోవిడ్ సమయంలో ఎక్కువ నష్ట పోయింది వీధి వ్యాపారులేనన్నారు. వారి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిందని అందులో ముఖ్యమైనది పీఎం స్వ నిధి పథకమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం రెట్టింపు కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారనన్నారు. అందుకు అనుగుణగా మెప్మాలో అనేక కార్యక్రమాలు తీసుకుని పని చేస్తున్నామన్నారు. గతంలో పేదల ఆదాయం రెండింతలు చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో 2014 నుంచి 2019 వరకు మెప్మాలో అనేక పథకాలు అమలు చేశామన్నారు. ఇప్పుడు కూడా ప్రజలందరికీ మేలు చేయడానికి, అభివృద్ధిలో ముందుకు తీసుకుపోవాలన్న ఉద్దేశ్యంతో వివిధ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అందుకే మెప్మా కు ఎండీ గా ఐఏఎస్ అధికారి కావాలని ముఖ్యమంత్రిని అడిగి మరీ తీసుకొచ్చానన్నారు. అంతకుముందు ఈ శాఖకు ఐఏఎస్ అధికారి లేరన్నారు. కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోవడానికి అందరూ కృషి చేయాలన్నారు. పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని పేదరికం నుంచి బయటపడాలన్నారు.

పీఎం స్వ నిధి కింద మొదటిసారి రుణం రూ.10 వేలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తే మరలా రూ.20 వేలు ఇవ్వడం, అవి కూడా ఏడాదిన్నర కాలంలో చెల్లిస్తే రూ.50 వేలు ఇస్తున్నారన్నారు. కోటి రూపాయలు ఆ పైన కోటిన్నర కూడా పొందవచ్చన్నారు. ప్రభుత్వ సహకారం కూడా ఇందులో ఉంటుందన్నారు. పీఎం స్వ నిధి పథకం కింద లబ్ధిదారులకు రుణాలపై కేంద్రం 7 శాతం వడ్డీ రాయితీ ఇస్తుందన్నారు. కేవలం 4.5 శాతం వడ్డీ మాత్రమే లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందన్నారు. పీఎం స్వ నిధి పథకం కింద తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే కోట్లల్లో రుణాలు పొందవచ్చన్నారు. ఈ రుణాలను సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధిని సాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సామాజిక భద్రతా పథకాల్లో భాగంగా ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, తదితర పథకాలతోపాటు వన్ నేషన్ వన్ రేషన్ కార్డు పథకాలను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రం నుంచి పీఎం స్వ నిధి పథకం కింద 5 లక్షల 48 వేల 957 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో 5 లక్షల 2 వేల 894 మంది పేదలకు రుణాలిచ్చారన్నారు.

పీఎం స్వ నిధి అమలులో జాతీయ స్థాయిలో ఉత్తమ పనితీరు కనపరిచిన అధికారులు, బ్యాంకర్లకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. రుణ మంజూరులో ఉత్తమ పనితీరు కనబరచిన అవార్డులు గెలిచిన గుంటూరు కార్పొరేషన్, పుత్తూరు, రాయచోటి మేజర్ మున్సిపాలిటీ కమిషనర్లకు అభినందనలన్నారు. అత్యుత్తమ పనితీరు కనపరిచి రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించిన పలు మైనర్ మున్సిపాలిటీ కమిషనర్లు, బ్యాంకర్లను కూడా మంత్రి అభినందించారు. పేద మహిళలు లక్షాధికారులు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో వివిధ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 2020-2024... మధ్య కాలంలో 5.03 లక్షల మందికి రూ.741 కోట్లు రుణాలను అందించగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024లో ఇప్పటి వరకు పేదలకు రూ.286 కోట్లు రుణాలు అందించామన్నారు.

పీఎమ్ స్వ నిధి పథకం సమర్థవంతంగా అమలు చేసినందుకు రాష్ట్ర స్థాయిలో 8మందికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించిందన్నారు. పలు మున్సిపాల్టీల కమిషనర్లు, బ్యాంకు అధికారులకు ఈ అవార్డులు ప్రకటించారన్నారు. పీఎం స్వ నిధి పథకం ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించి వారి అభివృద్ధికి కృషి చేసినందుకు మెప్మా డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్‌కు మంత్రి అభినందించారు.

ఎస్ఎస్‌బీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ దాస్యం మాట్లాడుతూ పేదలకు రుణాలిచ్చినందుకు అధికారులకు, బ్యాంకర్లకు అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు. లబ్ధిదారులు తొలుత పదివేలు రుణం తీసుకుని సక్రమంగా చెల్లిస్తే 50 వేలు వరకు రుణం తీసుకోవచ్చన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన వారు పది లక్షల రూపాయల ముద్ర లోన్లను సైతం తీసుకోవచ్చు. పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు రూ.5 కోట్ల వరకు రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్రం లో పీఎం స్వ నిధి పథకం క్రింద 10 కోట్ల రూపాయల చెక్కులను మంత్రి నారాయణ అందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, విశాఖపట్టణం మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, గుంటూరు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, ఎస్బీఐ డీజీఎం, మనీష్ కుమార్ సింగ్, ఎన్టీఆర్ జిల్లా పీడీ మెప్మా వెంకట నారాయణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం



# జగన్ పాలన వెలిగొండకు శాపం

## ధ్వజమెత్తిన మంత్రి నిమ్మల



- సాక్షికి ఇచ్చినన్ని నిధులు కూడా ప్రాజెక్ట్‌కు ఇవ్వలేదు
- పనులు పూర్తికాకుండానే జాతికి అంకితం అంటూ డ్రామాలు
- తల్లి, చెల్లిని మోసం చేసిన జగన్‌కు ప్రజలను మోసం చేయటం ఒక లెక్కా?
- రెండు దశల్లో ప్రాజెక్ట్ పనులు పూర్తి
- వచ్చే సీజన్‌కు 1.19 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం
- మంత్రులు డోలా, గొట్టిపాటితో కలిసి ప్రాజెక్ట్ పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

దోర్నాల (చైతన్యరథం): ఐదేళ్ల జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టును సహచర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామితో కలిసి మంత్రి రామానాయుడు మంగళవారం పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్లోకి వెళ్లి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు గతంలో టీడీపీ హయాంలో రూ.1,373 కోట్లు కేటాయించి రూ.1,319 కోట్లు ఖర్చు చేశాం. జగన్ పాలనలో రూ.3,518 కోట్లు కేటాయించి కేవలం రూ.170 కోట్లే ఖర్చు పెట్టారు. సాక్షి పత్రికకు ఇచ్చినంత ప్రాధాన్యం కూడా వెలిగొండ ప్రాజెక్టుకు జగన్ ఇవ్వలేదని తప్పుబట్టారు. సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.300 కోట్లు ఇచ్చుకున్నారని విమర్శించారు.

### పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవమా?

జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారింది. ఎన్నికల ముందు హడావుడి చేసి ప్రాజెక్ట్ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేస్తున్నామంటూ డ్రామాలాడారు. ఏ ప్రాజెక్టు వద్దకు వెళ్లినా జగన్ చేసిన విధ్వంసమే కనిపిస్తోంది. 10 క్యూసెక్కుల నీటి నిల్వ కూడా లేకుండానే వెలిగొండ ప్రారంభోత్సవమంటూ హడావుడి చేశారు. 1వ టన్నెల్‌లో లక్షా 20 వేల క్యూబిక్ మీటర్ల మట్టి ఉంది.. రెండో టన్నెల్‌లో బెంచింగ్ పనులు మిగిలిఉన్నాయి. 11 కిలో మీటర్లు మాత్రమే లైనింగ్ పనులు చేశారు. నిర్వాసితులను హౌస్ అరెస్ట్ చేసి మరీ జగన్.. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించారు. పనులు పూర్తి కాకుండా వెలిగొండ ప్రాజెక్టును జాతికి ఎలా అంకితం చేశారో జగన్ చెప్పాలని మంత్రి నిమ్మల డిమాండ్ చేశారు.

### దోచుకోవటంపైనే జగన్ దృష్టి

ఒక్క గ్రామానికీ పునరావాస కాలనీలు నిర్మించిన పాపానపోలేదు.



ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే ఫీడర్ ఛానల్‌కు గండ్లు పడ్డాయి. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.880 కోట్లు ఇవ్వాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వాసితులకు 7 కాలనీలు ఏర్పాటు చేశాం. సొంత తల్లి, చెల్లెలు, సొంత చిన్నాన్న కూతురిని జగన్ మోసం చేశారు. చిన్నాన్నని గొడ్డలితో చంపించిన జగన్‌కు ప్రకాశం జిల్లా ప్రజల్ని మోసం చేయడం పెద్ద విషయం కాదు. దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ జగన్ పరిపాలన మీద పెట్టలేదు. దోపిడీ, లూటీ ధ్యేయంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని జగన్ ధన యజ్ఞంగా మార్చారు. రెండు దశల్లో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులపై రూట్ మ్యాప్ తయారు చేసి నవంబర్ నెలలో పనులు ప్రారంభిస్తాం. ఫేజ్-1లో హెడ్ వర్క్స్, రెండు టన్నెల్స్ , ఫీడర్ ఛానెల్, రిజర్వాయర్, రెగ్యులేటర్ వంటి నిలిచిపోయిన పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నాటికి 1.19 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు.

### ఐదేళ్లు ఏం చేశారు: మంత్రి డోలా

వెలిగొండ పూర్తయితే నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. తాను అధికారంలోకి వస్తే ఏడాదిలోగా వెలిగొండ పూర్తి చేస్తానన్న జగన్ ఐదేళ్లపాటు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా, పరిహారం ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేసి జిల్లా ప్రజల్ని జగన్ మోసం చేశారని మండిపడ్డారు. 2014 - 19 లోనే మెజార్టీ పనులు పూర్తి చేశామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయన్నారు. వెలిగొండ పనులు ప్రారంభించింది చంద్రబాబు నాయుడే అని.. పూర్తి చేసేది కూడా చంద్రబాబు నాయుడే అని స్పష్టం చేశారు. త్వరితగతిన వెలిగొండ పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డోలా స్పష్టం చేశారు.

### వెలిగొండ వద్ద దారుణ పరిస్థితులు: మంత్రి గొట్టిపాటి

వెలిగొండ ప్రాజెక్టు చూసి ఆశ్చర్యపోయామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సం అంటూ జగన్ రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రాజెక్టు వద్ద దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టులన్నీ నాశనం అయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో వెలిగొండ ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేస్తారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

మంత్రుల వెంట ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, ఎంఎం.కొండయ్య, బిఎన్.విజయ్ కుమార్, ముత్తుముల అశోక్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కందుల నారాయణ రెడ్డి, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు.

### బైక్‌పై మంత్రి నిమ్మల

అంతకుముందు కడపరాజుపల్లి వద్ద ఫీడర్ కాలువను మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి బైక్‌లపై వెళ్లి సందర్శించారు. మంత్రి నిమ్మల స్వయంగా బైక్ నడిపారు. గొట్టిపాటి లక్ష్మితో కలిసి బైక్‌పై కలెక్టర్ తమీమ్ అన్సారియా వెళ్లారు.









# భూదొంగల

# భరతం పట్టండి!

- తెదేపా గ్రీవెన్స్‌లో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి అచ్చెన్న
- అధికశాతం భూకబ్జాల సమస్యలే..
- పెండింగ్ బిల్లుల కోసం పలువురి వినతి
- రైతాంగాన్ని ఆదుకోవాలంటూ వినతులు
- సమస్యల పరిష్కారానికి నేతల చర్యలు







అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తోన్న 'గ్రీవెన్స్'కు ఆదినుంచీ భూకబ్జాలపైనే ఎక్కువ వినతులు వస్తున్నాయి. వైసీపీ హయాంలో సాగిన దౌర్జన్యాలకు చెక్ చెప్పి.. తమ భూములు, స్థలాలు తమకు ఇప్పించమంటూ బాధితులు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. మంగళవారం వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సారథ్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలోనూ భూతగాదాలు, కబ్జాలకు సంబంధించిన వినతిపత్రాలే ఎక్కువ అందాయి. మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ఆయా అధికారులతో ఫోన్లలో మాట్లాడి చర్యలకు ఆదేశించారు. వినతుల స్వీకరణ అనంతరం నేతలు ఓ దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా బి కొత్తకోట గ్రామవాసి పొట్టా నరసింహులు వినతిపత్రం అందిస్తూ.. వీఆర్వో జాన్సన్ ప్రదీప్‌కుమార్ నకిలీ ఫైళ్లను సృష్టించిన తన భూమి కొట్టేసే ప్రయత్నం చేశాడని, నిలదీసినందుకు పోలీసులతో బెదిరిస్తున్నాడని వాపోయాడు. వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశాడు.

చంద్రశేఖరపురం మండలం అరివేముల సచివాలయంలో గ్రామ పశువైద్య సహాయకుడిగా చేరిన వైసీపీ నాయకుడు ప్రభుత్వ విధులు నిర్వర్తించకుండా.. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నాడని.. అతనిపై చర్యలు తీసుకోవాలని పెద్దరాజుపాలెం గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. అలాగే, జగనన్న రీసర్వేలో తన భూమిని తగ్గించి ఆన్‌లైన్ చేశారని, అధికారులతో కుమ్మక్కై తన భూమి కైంకర్యానికి కుట్ర చేస్తున్నారని అనకాపల్లి జిల్లా కుంచంగి గ్రామవాసి నాగులాపల్లి గణేష్ అర్జీని అందించారు. తనకు న్యాయం చేయాలంటూ వినతిపత్రంలో కోరాడు. అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన జి. రాములమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ భూములకు దొంగ పాస్ పుస్తకాలు పుట్టించి హక్కుదారులమైన తమను భూమిలోకి వెళ్లకుండా వై. గంగిరెడ్డి అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని.. అతని నుండి భూమిని విడిపించి న్యాయం చేయాలని కోరారు. ఇక -ప్రభుత్వం పట్టు పరిశ్రమ అభివృద్ధి చర్యల్లో భాగంగా రీలింగు అండ్ ట్విస్టింగు యూనిట్లకు కేటాయిస్తున్న స్థలాలు అనర్హులకు దక్కుతున్నాయని, అర్హులకు కేటాయించాలని అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన జి పునిత్ కుమార్ కోరారు. టీ. నరసాపురం ఫార్మర్స్ అగ్రికల్చర్ కర్పొరేటివ్ క్రెడిట్ సొసైటీలోని పలువురు సభ్యులు, డిపాజిటర్లు విజ్ఞప్తి చేస్తూ.. సొసైటీకి సీఈఓగావున్న టి కిషోర్‌కుమార్ మరికొంత మంది సిబ్బంది కలిసి సొసైటీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని నేతలను కోరారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణానికి చెందిన ఆదర్శ ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు ఏ మేరి విజ్ఞప్తి చేస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో కెపాసిటీ బిల్డింగ్ సెంటర్స్ (సి.బి.సి) కార్యక్రమం నిర్వహించినందుకుగాను తమకు రావాల్సిన రూ.76.20.532 సొమ్ము విడుదలచేసి సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన పులిగోర్ల నాగరత్తమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమికి దొంగపట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నారని.. ఆక్రమణదారులు నుండి తమ భూమిని విడిపించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ నందు పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐటీ మేనేజర్లు మరియు సహాయ ఇంజనీర్లు, అటెండర్లు విజ్ఞప్తి చేస్తూ.. ఔట్ సోర్సింగ్ నుండి తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చి సీనియార్టీ ప్రకారం తమకు రావాల్సిన లబ్ధిని అందించి న్యాయం చేయాలని కోరారు. బేడ (బుడ్గ) జంగం ఎస్సీ కుల సమస్యను ప్రభుత్వం త్వరగా పరిష్కరించి తమ జాతికి మేలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బేడ (బుడ్గ) జంగం కులం సంక్షేమ సేవా సంఘం సభ్యులు సంకుల సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ప్రకాశం జిల్లావాసి గోరంట్ల గోపి అర్జీనిస్తూ, పశు వైద్యశాలల్లో మరుగుదొడ్లు లేక మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని.. మరుగుదొడ్లను ఏర్పాటు చేసి ఉద్యోగుల అవస్థలు తీర్చాలని మంత్రికి విన్నవించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులు విజ్ఞప్తి చేస్తూ.. తమకు రావాల్సిన బకాయిలను వెంటనే ఇప్పించేలా కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యాన్ని ఆదేశించాలని మంత్రిని కోరుతూ వినతిపత్రం అందచేశారు.







# ఇదీ అసలు నిజం!

- ఉన్నవన్నీ వైఎస్సార్ కుటుంబ ఆస్తులే..
- బిడ్డలిద్దరికీ సమానమేనన్నది వైఎస్సార్ మాట
- విజయవాడలో రాసుకున్న ఎంవోయూకి సాక్షిని నేనే
- అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం ధర్మం
- సోషల్ మీడియాలో అసత్యాల ప్రచారం వద్దు
- ఆస్తుల వివాదంపై విజయమ్మ బహిరంగ లేఖ



అమరావతి (చైతన్య రథం): వైఎస్ జగన్, వైఎస్ షర్మిల మధ్య ఖిగుస్తోన్న ఆస్తి పంపకాల వివాదంపై తల్లి వైఎస్ విజయమ్మ స్పందించారు. ఈ మేరకు వైఎస్సార్ అభిమానులకు బహిరంగ లేఖ రాశారు. "జరగకూడని సంఘటనలన్నీ కళ్ల ముందే జరిగిపోతున్నాయి. ఈ ఘటనలు నా పిల్లలిద్దరికే కాదు.. రాష్ట్రానికీ మంచిది కాదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రతి ఒక్కరికీ మీ విజయమ్మ చేస్తున్న అభ్యర్థన. ఇప్పుడు జరుగుతున్న ఘటనలు చూస్తుంటే మనసుకు చాలా బాధేస్తోంది. అబద్ధాల పరంపర కొనసాగుతోంది. తెలిసి కొంత.. తెలియక కొంత మాట్లాడుతున్నారు. అవి దావానలంలా ఎక్కడెక్కడికో పోతున్నాయి. ఇవి కంటిన్యూ అవ్వొద్దు. సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయొద్దని లేఖలో విజ్ఞప్తి చేశారు.

**వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి అసత్యాలు చెప్పారు..**

ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి తదితరులు ఎన్నో అసత్యాలు చెప్పారు. వైఎస్సార్ బతికి ఉండగానే ఆస్తులు పంచేశారన్నది అవాస్తవం. పిల్లలు పెరుగుతున్న రోజుల నుంచీ ఆస్తులు ఇద్దరి పేరు మీద పెట్టారు. ఆస్తులు పంచారనడం అబద్ధం. వైఎస్ఆర్ ఉన్నపుడే షర్మిలకు ఆస్తులు ఇచ్చేశారంటూ లిస్ట్ చదివారు. అప్పుడు, జగన్ పేరుమీద పెట్టిన ఆస్తుల లిస్ట్ కూడా చదివి ఉండాల్సింది. వైఎస్ఆర్ చేసింది పంపకం కాదని ఆడిటర్ విజయసాయికి తెలియనిది కాదు. ఎంవోయూపై సాక్షి సంతకం చేసిన ఈ ఇంటి బంధువు వైవీ సుబ్బారెడ్డికీ తెలియనిది కాదు. అయినా.. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం బాధ కలిగించింది. అబద్ధాల పరంపర కొనసాగకుండా ఉండటానికి నిజం చెబుతున్నా. రాజశేఖర్‌రెడ్డి మాట ప్రకారం.. ఆస్తులు ఇద్దరికీ సమానం. ఇదే నిజం. నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్న వైఎస్ఆర్ ఆజ్ఞ నిజం. అన్ని ఆస్తులూ కుటుంబ ఆస్తులేనన్నదీ నిజం.

**వైఎస్ఆర్‌కు జగన్ ఇచ్చిన మాట ఇదీ..**

వైఎస్ఆర్ చివరి రోజుల్లో జగన్ ఆయనకు ఇచ్చిన మాట "నాన్నా.. నీ తర్వాత ఈ లోకంలో పాప మేలు కోరే వారిలో నేను మొదటి వాడిని" అని చెప్పింది కూడా నిజం. ఇది "నాలో నాతో వైఎస్ఆర్ అనే పుస్తకం"లో ఎప్పుడో రాశా. రాజశేఖర్‌రెడ్డి బతికి ఉండగా ఆస్తులు పంచలేదు. ఉన్న ఆస్తులను ఒక్కొక్కరు చూసుకున్నారు. అందరం కలిసి ఉన్నాం. అన్నీ కుటుంబ ఆస్తులే. ఇక పంచుదాం అనుకొనే సరికి, వైఎస్సార్ ప్రమాదంలో వెళ్ళిపోయారు. అయితే.. డివిడెండ్ రూపంలో జగన్ వాటా తీసుకొని, రూ.200 కోట్లు షర్మిల భాగానికి ఇచ్చారు. ఎంవోయూ ప్రకారం జగన్ 60 శాతం.. షర్మిలకు 40 శాతం అయితే, ఎంవోయూకు ముందు సగం సగం డివిడెండ్ తీసుకొనే వారు. వీటన్నింటికీ అప్పుడు, ఇప్పుడూ నేనే సాక్షిని. 2019లో జగన్ సీఎం అయిన రెండు నెలలకు డివైడ్ అవ్వాలని ఇడుపులపాయలో ప్రపోజల్ పెట్టాడు.

**విజయవాడలో ఆస్తుల పంపకం జరిగిందిలా...**

విజయవాడలో నా సమక్షంలోనే 2019లో ఆస్తుల పంపకంపై ఎంవోయూ రాసుకున్నారు. ఇది జగన్ నోటితో చెప్పి.. అతని చేతితో రాసిన ఎంవోయూనే ఇది. హక్కు ఉంది గనకే షర్మిలకు రూ.200 కోట్ల డివిడెండ్లు ఇచ్చారు. షర్మిలకి హక్కు ఉంది గనకే అధికారికంగా ఎంవోయూ రాసుకున్నారు. ఆస్తి ఏదీకూడా జగన్ గిఫ్ట్‌గా ఇస్తున్నది కాదు. అటాచ్‌మెంట్‌లో లేవు కనుక ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ 100 శాతం, ఎలహంక ప్రాపర్టీ 100 శాతం షర్మిలకు వెంటనే ఇస్తానని జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. ఇవి కూడా ఇవ్వకుండా.. అటాచ్‌మెంట్‌లో లేని ఆస్తుల విషయంలోనూ షర్మిలకు అన్యాయం జరిగింది. షర్మిల భాగానికి వచ్చిన భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, వైఎస్ఆర్ ఇల్లు.. ఇలాంటివి కేసుల తర్వాత ఇవ్వాల్సి ఉంది.

**అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం ధర్మం..**

షర్మిల పాలిటిక్స్‌లో జగన్ చెప్పినట్టే చేసింది. జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడింది. అధికారంలో రావడానికి ఆమె కృషి ఎంతో ఉంది. జన్మనిచ్చిన ప్రతి తల్లిదండ్రులకూ బిడ్డలందరూ సమానమే. ఒక బిడ్డ ఇంకో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం. తల్లిగా, అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడటం నా విధి, ధర్మం. ఇంతమంది పెద్ద మనుషులు చెబుతున్న అబద్ధాల మధ్య నిజం తెలియాలనే ఇన్ని విషయాలు చెప్పాల్సి వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న రచ్చను.. నా మాటలు మాత్రమే ఆపుతాయని విశ్వసిస్తున్నా అని విజయమ్మ తన లేఖలో పేర్కొన్నారు.

### మహిళా సంక్షేమమే లక్ష్యంగా..

# రేపటి నుంచే ఉచిత సిలిండర్ల పథకం

- సుమారు కోటిన్నరమందికి అమలు
- ప్రతి కుటుంబానికి ఏటా రూ.2684 లబ్ధి
- మహిళల తరపున ప్రభుత్వానికి థాంక్స్
- మాజీ మంత్రి పీతల సుజాత






అమరావతి (చైతన్య రథం): సంక్షేమం అంటేనే తెలుగుదేశం పార్టీ. తెలుగుదేశం అంటేనే సంక్షేమమని మాజీ మంత్రి పీతల సుజాత వ్యాఖ్యానించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా అన్న ఎన్టీఆర్ నిలిస్తే.. ఆయన బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పయనిస్తూ ఆంధ్రప్రదేశ్‌ని పేదరికం లేని రాష్ట్రంగా నిలిపేందుకు శ్రమిస్తున్నారన్నారు. 'చంద్రబాబు మానస పుత్రిక దీపం పథకం, ఈ దీపావళి నుంచి మహిళల కళ్లలో ఆనందం నింపడానికి ఉచిత సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారు. అందుకు రాష్ట్ర మహిళలందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని పీతల సుజాత వ్యాఖ్యానించారు.

కట్టెల పొయ్యితో మహిళలు పడే కష్టాలు చూసి చలించిన చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దీపం పథకం ప్రవేశపెట్టారని, దీనిద్వారా 65 లక్షలమంది మహిళలకు గ్యాస్ స్టవ్, సిలిండర్ అందించారన్నారు. ఆ తరవాత వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిన సంగతి రాష్ట్ర మహిళలందరికీ తెలుసని, మరలా మహిళల కళ్లలో వెలుగులు నింపేందుకు సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా దీపం పథకం పునఃప్రారంభిస్తున్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచడమే కాకుండా ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈనెల 29 ఉదయం 10 గంటలు నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ప్రారంభం కానుందని, అక్టోబర్ 31న దీపావళి సందర్భంగా ఉచిత గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయనున్నారని మాజీ మంత్రి సుజాత వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబం ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్‌ను ఉచితంగా పొందవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని డెలివరీ పొందిన 48 గంటల్లో డిబిటి ద్వారా మొత్తం సొమ్ము రాయితీ లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా జమ అవుతుందన్నారు. రాష్ట్రంలోని కోటి 47 లక్షల తెల్లరేషన్ కార్డు కుటుంబాలకు పథకం ద్వారా లబ్ది చేకూరనుందని, ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.894.92గా ఉండగా.. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లతో ఒక్కో కుటుంబానికి రూ.2684 లబ్ధి చేకూరుతుందని అన్నారు. రాష్ట్రంలోని కోటి 47 లక్షల తెల్లరేషన్ కార్డుదారులకుగాను ఏడాదికి రూ.2684 కోట్లు రూపాయలు, ఐదేళ్లకు 13 వేల కోట్ల ఆర్థికభారం కూటమి ప్రభుత్వం భరించనుందని వివరించారు. మహిళలకు సంబంధించి ఆస్తి హక్కు నుంచి విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్ల వరకు తెలుగుదేశం పార్టీ ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తు చేస్తూ.. నేడు మూడు పార్టీల కూటమి ప్రభుత్వంలో సైతం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఆర్థిక సమస్యలున్నా ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేయడం మహిళా సంక్షేమం, గౌరవం, భద్రత, ఎదుగుదలపట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని తెలియచేస్తుందని మాజీ మంత్రి సుజాత కొనియాడారు.

# సిగ్గుందా.. జగన్?

- విద్యుత్ వ్యవస్థను భ్రష్టుపట్టించింది నువ్వే
- ప్రజలను ఎన్ని విధాలుగా పీడించావో గుర్తు లేదా?
- విద్యుత్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదు నీకు..
- జగన్‌పై ధ్వజమెత్తిన మాజీ మంత్రి జవహర్



అమరావతి (చైతన్య రథం): ఐదేళ్ల కాలంలో విద్యుత్ రంగాన్ని భ్రష్టుపట్టించిన జగన్‌రెడ్డి.. తిరిగి ఎన్డీయే సర్కారుపై విమర్శలకు దిగడం సిగ్గుచేటని మాజీ మంత్రి కెఎస్ జవహర్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'జగన్‌రెడ్డి అసమర్థ పాలనతో విద్యుత్‌రంగంలో రూ.1,29,503 కోట్ల నష్టం వాటిల్లింది. ట్రూఅప్ ఛార్జీలు, ట్రూ అప్ ఫ్యూయల్ ఛార్జీలంటూ కొత్త పేర్లతో రూ.32,166 కోట్ల ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపాడని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన జగన్, విద్యుత్ చార్జీలు పూర్తిగా తగ్గిస్తానన్న మోసపూరిత హామీలతో గద్దెనెక్కి.. ఐదేళ్ల పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత దక్కించుకున్నాడని ఎద్దేవా చేశారు. విద్యుత్ రంగాన్ని భ్రష్టుపట్టించిన జగన్‌కు.. విద్యుత్ శాఖపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. జగన్‌రెడ్డి హయాంలోనే 2022-23కు సంబంధించి రూ.6,114 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను డిస్కంలకు సమర్పించిన విషయం గుర్తులేదా? అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఏపీని.. స్వార్థపూరిత, అరాచక, అవినీతి పాలనతో నాశనం చేశాడని ధ్వజమెత్తారు. ఏపీ జెన్‌కో కేంద్రాల నుంచి కొనుగోలు చేయకుండా కమీషన్ల కోసం అధిక రేట్లకు కొనుగోలు చేసి విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. 'వైసీపీ ప్రభుత్వం అదనంగా ఒక్క యూనిట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో జగన్‌రెడ్డి చేసింది శూన్యం. పైగా గత ప్రభుత్వం చేసుకున్న పీపీఏలను రద్దు చేశారు. పీపీఏలలో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు లేవని కేంద్రం స్పష్టం చేసినా పెడచెవిన పెట్టారు. అదేవిధంగా సమయం, సందర్భం లేకుండా విద్యుత్ కోతలు విధించి ప్రజలను రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టాడు. జగన్ రెడ్డి పాలనలో ఒక్క విద్యుత్ శాఖ అనే కాకుండా అని శాఖలు నాశనమైయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు నిరంతరం కృషి చేస్తుంది. దేశంలో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం చంద్రబాబుది. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే జగన్‌రెడ్డి విషపూరిత రాజకీయాలు చేస్తున్నారు" అని కెఎస్ జవహర్ ఆ ప్రకటనలో ధ్వజమెత్తారు.

# అబద్ధం @ జగన్!



**అధికారంలో ఉన్నన్నాళ్లూ అరాచక పాలన సాగించిన జగన్‌రెడ్డి.. గద్దె దింపేసిన తరువాత అసత్యాల దందా సాగిస్తున్నాడు. వైసీపీ హయాంలో విధ్వంసానికి గురైన రాష్ట్రం.. కూటమి హయాంలో వికాశంవైపు అడుగులేస్తుండటం -జగన్‌కు లేశమాత్రం నచ్చడం లేదన్నది అతని ప్రవర్తన చెప్పకనే చెబుతోంది. రాష్ట్రం సర్వనాశనమైనా ఫరవాలేదు, కూటమి ప్రభుత్వానికి ఖ్యాతి దక్కకూడదన్న పగే జగన్ ప్రతిచర్యలో కనిపిస్తోంది. నిర్మాణాత్మక విమర్శతో రాష్ట్రాభివృద్ధికి సహకరించాలన్న ఇంగితం లేకుండా.. ప్రభుత్వ పాలనా విధానాలపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న జగన్ కక్షా రాజకీయ ధోరణిని ప్రజలు ఛీత్కరించుకుంటున్నా.. పంథా మార్చుకోకపోవడం.. అతని వికృత రాజకీయ విధానానికి పరాకాష్ట.**

అబద్ధానికి ప్యాంటు, చొక్కా వేస్తే అది జగన్మోహన్ రెడ్డి! ఐదేళ్ల జగన్ రెడ్డి విధ్వంస పాలనను ప్రజలు ఛీ కొట్టినా బుద్ధి రావడంలేదు. తాను నమ్ముకున్న, తన పార్టీ సిద్ధాంతమైన అబద్ధాల పునాదులపైనే రాజకీయం చేస్తున్నాడు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టే కుటిలయత్నం చేస్తున్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నాడు.

2019 ఎన్నికలకు ముందు కోడి కత్తి డ్రామా, బాబాయ్ హత్య, పింక్ డైమండ్, 35మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఐలకు డీఎస్పీ పోస్టులంటూ పచ్చి, అడ్డగోలు అబద్ధాలు ప్రచారం చేశాడు. చంద్రబాబు రూ.6 లక్షల కోట్లు అవినీతి చేశారంటూ పుస్తకం ప్రచురించి పంచిపెట్టాడు. ఒక్క చాన్స్ పేరుతో గారడీ చేశాడు. అధికారంలోకి రాగానే మద్యపాన నిషేధం, రూ.3 వేలు పెన్షన్, మెగా డీఎస్సీ, ప్రత్యేకహోదా, అమరావతే రాజధాని అంటూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాడు. తీరా అధికారంలోకి వచ్చాక కరెంటు, బస్సులు చార్జీలు మొదలు నిత్యావసర ధరల వరకూ పెంచేసి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచాడు. తానే స్వయంగా మద్యం వ్యాపారం చేసి వేలమంది ప్రాణాలు తీశాడు. మహిళల మాంగల్యాలు తెంచాడు. అభివృద్ధి జాడ లేకుండా చేశాడు. సంక్షేమానికి పాడిగట్టాడు. ఇదేంటని ప్రశ్నించిన విపక్షాలపై కక్షపూరితంగా అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేశాడు.

**కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం**

ప్రతిపక్ష హోదా కూడా రాని స్థాయి ఓటమిని ప్రజలు కట్టబెట్టినా జగన్మోహన్‌రెడ్డికి సిగ్గు రాకపోవడం నిజంగా సిగ్గు కలిగించే విషయం. వినుకొండలో జరిగిన ఘర్షణలో ఒకరు చనిపోతే దాన్ని తన రాజకీయ లబ్ధికి వాడుకునే యత్నం చేశాడు జగన్‌రెడ్డి. ఆ హత్యను టీడీపీకి అంటగట్టడమే కాకుండా కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయంటూ ఢిల్లీ వెళ్లి నానా యాగీ చేశాడు. ఆ పేర్లు చెప్పమని ప్రభుత్వం అడిగితే డొంకతిరుగుడు సమాధానాలతో దాటవేశాడు. విజయవాడ వరదల్లో 60 మంది చనిపోయారని మరో అబద్ధపు ప్రచారం చేశాడు. ఆ పేర్లు ఇమ్మంటే పులివెందుల ఎమ్మెల్యే సౌండ్ చేయడంలేదు. ఈ అబద్ధాలు చాలవన్నట్టు కృష్ణా వరదల్లో అమరావతి మునిగిందని మరో విష ప్రచారం చేశాడు. చంద్రబాబు ఇంటిని రక్షించుకోవడం కోసమే వెలగలేరు లాకులు ఎత్తివేశారని సాక్షిలో తప్పుడు రాతలు రాశాడు. విజయవాడ వరద సాయం రూ.203 కోట్లు రాగా అందులో రూ.534 కోట్లు అవినీతి జరిగిందని ప్రచారం చేయడం ద్వారా తన రాజకీయ దిగజారుడుతనాన్ని బయటపెట్టాడు. వైసీపీ రంగులున్న బోట్లతో ప్రకాశం బ్యారేజీని విధ్వంసం చేసే కుట్ర చేశాడు. స్కిల్ కేసుపై అబద్ధాల సాక్షిలో తప్పుడు వార్త వండించాడు.

తల్లికి వందనం ఒక్కరికే అని అమరావతి భూములను టీడీపీ నాయకులు దోచేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపేశారని, లబ్ధిదారుల పింఛన్లు తొలగించారని, అమరావతికి రూ.15 వేల కోట్ల సాయం అప్పేనని, కక్షసాధింపులో భాగంగా వైసీపీ కార్యాలయాలు కూల్చేస్తున్నారని, నేతన్నలకు ఉచిత విద్యుత్ హామీ గాలికొదిలేశారని, మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమని ఇష్టానుసారంగా విష ప్రచారం కొనసాగిస్తున్నాడు.

**సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా అడుగులు**

జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల విధ్వంస పాలనతో రాష్ట్రం సర్వ నాశనమైంది. ప్రజా ధనాన్ని దోచుకుని రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాడు. భూమాఫియాతో చెలరేగాడు. జే ట్యాక్స్ దెబ్బకు పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో పరిశ్రమలు లేక ఉపాధి కరువై వలసలు పెరిగాయి. ఆలయాలపై దాడులు, తిరుమల పవిత్రత దెబ్బతీయడంతో పాటు డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు, అత్యాచారాలకు ఏపీ కేరాఫ్‌గా మారింది. గాడి తప్పిన పాలనను చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి బాట పట్టిస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేలకు పెన్షన్ పెంపు, మెగా డీఎస్సీ, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, కేంద్రం నిధులు తెచ్చుకోవడంలో సఫలీకృతం కావడం, దీపం పథకం అమలు, గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్, ప్రజారోగ్యానికి చర్యలు, దేవాదాయశాఖ ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది.

# కార్యకర్తల కుటుంబం.. తెలుగుదేశం!

తెలుగుదేశం

దేశ రాజకీయ చరిత్రలో అనేక ప్రాంతీయ పార్టీలు కళ్లముందే కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ తెలుగుదేశం పార్టీ స్థాపించి 42 వసంతాలు దాటినా నేటికీ చెక్కుచెదరకుండా తెలుగు ప్రజలకు సేవలు అందించగలుగుతుందంటే దానికి కారణం కార్యకర్తలే. ఎన్ని ఆటు పోట్లు ఎదురైనా తట్టుకుని, ఆస్తుల్ని, ఆప్తుల్ని సైతం పోగొట్టుకుని పార్టీ కోసం కార్యకర్తలు చేస్తున్న త్యాగం, పడుతున్న కష్టం వెలకట్టలేనిది. కార్యకర్తల కష్టం, శ్రమతోనే నేటికీ పసుపు జెండా తెలుగు రాష్ట్రాల్లో రెపరెపలాడుతోంది. పార్టీ కోసం ప్రాణాలిచ్చే కార్యకర్తలు టీడీపీ సొంతం. అలాంటి కార్యకర్తల క్షేమం, సంక్షేమం కోసం ఏదోకటి చేయాలనే సంకల్పంతో యువ నాయుడు నారా లోకేష్ ఆలోచన నుంచి పురుడు పోసుకున్నదే కార్యకర్తల సంక్షేమం! కన్నతల్లి తన బిడ్డల్ని ఏవిధంగా ఆదరిస్తుందో తెలుగుదేశం పార్టీ కూడా కార్యకర్తలపై అదే ప్రేమ చూపిస్తుంది.

**రూ.100లతో రూ.5 లక్షల ప్రమాద బీమా**

టీడీపీ సభ్యత్వ నమోదులో రూ.లక్ష కట్టిన వారికి శాశ్వత సభ్యత్వం అందిస్తుంది అలాగే రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకొన్న కార్యకర్తలకు గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచింది. అలాగే టీడీపీ సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి మరణించిన రోజే అంత్యక్రియలకు రూ.10 వేలు అందిస్తుంది. దీంతోపాటు కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుంది.

**సంక్షేమానికి రూ.123 కోట్లు**

కార్యకర్తల సంక్షేమ నిధిని ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు కార్యకర్తల కోసం రూ.123 కోట్లు ఖర్చు చేసింది తెలుగుదేశం పార్టీ. ప్రమాదంలో మరణించిన 5,113 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.102 కోట్ల ప్రమాదబీమా, సహజ మరణాల కుటుంబాలకు, ప్రమాదాల్లో గాయపడినవారికి రూ.18 కోట్లు, పేద విద్యార్థుల చదువులకు రూ.2.5 కోట్లు ఖర్చుచేసిన ఘనత తెలుగుదేశం పార్టీది. 180మంది విద్యార్థులు విదేశాల్లో చదివేందుకు ఆర్థిక సాయం, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు 4,732మందిని పార్టీ చదివిస్తోంది.

**సభ్యత్వ నమోదులో దేశంలోనే ఎనిమిదో అతిపెద్ద పార్టీ**

యువ నాయకుడు నారా లోకేశ్ ఆలోచన మేరకు పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రతి రెండేళ్లకోసారి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తెలుగుదేశం పార్టీ చేపడుతుంది. కార్యకర్తల సభ్యత్వ నమోదు దేశంలో తొలిసారి తెలుగుదేశం పార్టీ చేపట్టింది. ప్రస్తుతం సభ్యత్వపరంగా దేశంలోనే ఎనిమిదో అతి పెద్ద పార్టీగా తెలుగుదేశం నిలిచింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా తెలుగుదేశం పార్టీలో 70 లక్షలమంది కార్యకర్తలు చేరారు. 2024-26కు సంబంధించిన సభ్యత్వ నమోదు ద్వారా కోటి కార్యకర్తలకు సభ్యత్వాలు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ లక్ష్యం పెట్టుకుంది.


- మంగినపల్లి ఎలీషాబాబు,
అనలిస్ట్




## రేపు టీడీపీ కేంద్ర కార్యాలయంలో
# ప్రజా వేదిక కార్యక్రమం రద్దు

అమరావతి (చైతన్యరథం): దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 31వ తేదీ, గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరగాల్సిన "ప్రజా వేదిక" కార్యక్రమం రద్దు చేశారు. ఆ రోజు ఎటువంటి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించరు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఎమ్మెల్సీ కేంద్ర కార్యాలయం కార్యదర్శి, పర్చూరి అశోక్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# టెట్ ఫైనల్ కీ విడుదల



అమరావతి (చైతన్యరథం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫైనల్ కీ ని పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ అక్టోబర్ మూడవ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్షలు నిర్వహించింది. తొలి కీ విడుదల చేసిన తర్వాత అభ్యర్థుల నుండి అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాలన్నింటినీ పరిశీలించి తయారుచేసిన ఫైనల్ కీ ని విడుదల చేసినట్లు పాఠశాల విద్యా డైరెక్టర్ శ్రీ విజయ్ రామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు అభ్యర్థులు ఫైనల్ కీ వివరాలను **http://csc.ap.gov.in.** వెబ్‌సైట్ నుండి పొందవచ్చు అని తెలియజేశారు.

# సుపరిపాలనను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పట్టభద్రులదే

## ◆పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించిన జీవీ, మక్కెన





వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో సుపరిపాలనను ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత యువత, పట్టభద్రులపైనే ఉందని తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. వారి ఆకాంక్షల మేరకు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత సీఎం చంద్రబాబు, ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. వినుకొండ శివయ్య స్తూపం సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సందర్శించారు. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో ముచ్చటించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మె ల్యే జీవీ... వినుకొండతో పాటు పల్నాడులో డిగ్రీ పూర్తిచేసిన వారు చాలామంది ఉన్నారన్నారు. వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు ఉన్నా ఇప్పుడు అది చెల్లదని, కొత్తగా నమోదు చేసుకోవాల్సిందేనని చెప్పారు. ఓపెన్ డిగ్రీ పూర్తిచేసిన వారు కూడా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులేనని తెలిపారు. 2022లో డిగ్రీ పూర్తయిన వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ అహర్నిశలు అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వం ముందున్న ధ్యేయమన్నారు. 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నవంబర్‌లో నోటిఫికేషన్ ఇవ్వబోతున్నారని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా పట్టభద్రులంతా ఎన్డీఏ ప్రభుత్వానికి అండగా నిలబడాలని, ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీమంత్రిగా, సీనియర్ నాయకుడిగా ఆయనకు ఎంతో అనుభవం ఉందని, విద్యా సంస్థల నిర్వహణలో కూడా ఆయనకు చాలా అనుభవం ఉంది కాబట్టి, అలాంటి వ్యక్తిని ఎన్నుకుంటే ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. మంచి వ్యక్తిని ఎన్నుకోవడం, మంచి ప్రభుత్వానికి అండగా ఉండటం కోసం, 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం చదువుకున్న యువత మొత్తం ముందుకు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతీ పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 5 నాటికి ఈ ప్రక్రియ దాదాపు పూర్తవుతుందని, తర్వాత ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉండదు కాబట్టి ముందుగానే ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, సూచించారు. ఓటు హక్కు చాలా విలువైందని, వజ్రాయుధం లాంటిదని, అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పత్తి పూర్ణచంద్రరావు, పివి సురేష్ బాబు, పల్ల మీసాల దాసయ్య, గంధం కోటేశ్వరరావు, వీర గంధం ప్రశాంత్, చికెన్ బాబు, నర్రా కిషోర్, ఐత్తుల గోవిందరాజులు, తన్నీరు ఆంజనేయులు, లింగా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్వయం సహాయక సంఘాలు ఆర్థిక ప్రగతి సాధించాలి : జీవీ ఆంజనేయులు

మహిళలు తమ కాళ్లపై నిలబడి ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జీవి ఆంజనేయులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా ) ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఎమ్మెల్యే జీవి సందర్శించి మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, పిండి వంటలు, వస్త్రాలు, ఫ్యాన్సీ వస్తువులు, బొమ్మలు, ఆహార పదార్థాలను పరిశీలించి స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

### గంగినేని ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దొడ్డ భవాని నరసరావుపేట పట్టణంలోని డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థిని తండ్రిని కోల్పోయి చదువులకు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో గ్రామంలోని నాయకుల రోడ్ల వీరాంజనేయరెడ్డి సహకారంతో మంగళవారం వినుకొండ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద విద్యార్థినికి గంగినేని ఫౌండేషన్ అధినేత గంగినేని రాఘవ మాస్టారు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జి.వి.రమణరావు చేతులమీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని విద్యార్థినికి అందజేశారు.

# వెలిగొండ ప్రాజెక్టు నీటిని దొనకొండకు అందించాలి

## ◆రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మలకు గొట్టిపాటి లక్ష్మి వినతి



దర్శి (చైతన్యరథం): పశ్చిమ ప్రకాశానికి జీవనాడిగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్లేందుకు మంగళవారం మంత్రుల బృందం ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించడం అభినందనీయమని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మంగళవారం యర్రగొండపాలెం నియోజకవర్గం దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు మంత్రుల బృందంతో కలిసి గొట్టిపాటి లక్ష్మీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దొనకొండ ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్ట్ నీటిని అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేశామని, మెట్ట ప్రాంతంగా ఉన్న దొనకొండ ప్రాంతంలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయని కరువు ప్రాంతంగా ఉందని జీవనాధారం లేక ఈ ప్రాంత ప్రజలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి వలసలు వెళుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వెలిగొండ నీటిని దొనకొండకు అందించాలని గొట్టిపాటి లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. టీడీపీ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు నుంచి దొనకొండకు నీటిని అందించే కాలువలకు ప్రణాళికను రూపొందించిందని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి కాలువలను తీయిస్తే వెనుకబడిన దొనకొండ వంటి ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎలక్షన్‌బాబు, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్, వెలుగొండ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సందర్శన వేళ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా గొట్టిపాటి లక్ష్మీతో కలిసి బైక్ పై ప్రయాణించారు.



## కపిల్‌ను సన్మానించిన ఎంపి కేశినేని శివనాథ్

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోల్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసెందుకు అమరావతికి వచ్చిన భారత్ క్రికెట్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని కేశినేని శివనాథ్ నివాసంలో కపిల్ దేవ్ మంగళవారం కలవటం జరిగింది. ఎంపి కేశినేని శివనాథ్ కపిల్ దేవ్‌కి సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించటంతో పాటు శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ ఏపి క్రికెట్‌కి సంబంధించి కపిల్ దేవ్‌తో చర్చించారు. ఏసీఏ అధ్యక్షుడిగా రాష్ట్రంలో క్రికెట్ డెవలప్మెంట్ కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంపి కేశినేని శివనాథ్ వివరించారు. రాజధాని అమరావతి ప్రాంతంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే విశాఖ- విజయనగరం మధ్యలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ఎంపి కేశినేని శివనాథ్, కపిల్ దేవ్ ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు వెళ్లారు.

# దీపావళి పండుగ కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్

## ◆దేశ రాజకీయాల్లో ఇదొక సంచలనం

## ◆ఉచిత సిలిండర్ పథకంపై హర్షం వ్యక్తం చేసిన టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్



చిత్తూరు (చైతన్యరథం): దీపావళి పండుగ కానుకగా రాష్ట్ర ప్రజలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు రాయితీ నిధులు రూ.895 కోట్లకు కూటమి ప్రభుత్వం పాలనా అనుమతులు ఇవ్వడం సంతోషంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశ రాజకీయాల్లో ఇలాంటి పథకం ఏ రాష్ట్రంలోనూ అమలులో లేదని, మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందించడం ఒక సంచలనమన్నారు. ఎన్నికల హామీల్లో భాగమైన సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమాన్ని ఈనెల 31వ తేదీ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించడం అభినందనీయమన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై విపక్షాలకు మాట్లాడే అర్హత లేదని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజల్ని దోచుకోవడమే లక్ష్యంగా పరిపాలన సాగిందన్నారు. తన చిన్నతనంలో కట్టెల పొయ్యిపై అన్నం వండుతూ ఇబ్బందులు పడ్డ తల్లిని చూసిన చంద్రబాబునాయుడు. రాష్ట్రంలో ఏ మహిళా ఇలా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నాడు దీపం పథకం ప్రవేశపెట్టారని, ఆ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇప్పుడు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇవ్వడం కూడా దేశానికి ఆదర్శంగా నిలవడం ఖాయమన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంభం ఉచిత గ్యాస్ సిలెండర్ కు అర్హులని, దీపావళి పండగ కానుకగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనన్నారు. సిలెండర్ ఇంటికి వచ్చిన రెండు రోజుల్లో లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లతో పల్లెలో పండగ వాతావరణం నెలకొందని, ఇది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికి ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేస్తున్నామని, జగన్ రెడ్డి లా మాయ మాటలు చెప్పడం లేదన్నారు. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని తీసుకురావడం జరిగిందని సప్తగిరి ప్రసాద్ వ్యాఖ్యానించారు.

# దీపావళి పండుగ వేళ మందుగుండు సామగ్రితో అప్రమత్తంగా ఉండాలి

◆ మండపేట మండలంలో దీపావళి సామగ్రి పేలుడులో ఒకరు మృతి, పలువురికి గాయాలు

◆ బాధితులను పరామర్శించిన మంత్రి వాసంశెట్టి

◆ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

కాకినాడ (చైతన్యరథం): దీపావళి సామాగ్రి పేలుడులో గాయపడిన బాధితులను మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అక్కడున్న వైద్యులకు సూచించారు. భయపడాల్సిన పనిలేదని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామంలో సోమవారం జరిగిన దీపావళి సామాగ్రి పేలుడు ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా... మరో ఇద్దరికి తీవ్ర గాయాలైయ్యాయి. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న



క్షతగాత్రులను మంగళవారం ఉదయం మంత్రి వాసంశెట్టి పరామర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. ప్రమాదంలో మృతి చెందిన కొల్లు వెంకట కృష్ణ భార్య జయశ్రీ ను, మరో బోటు ప్రమాదంలో విద్యుత్ షాక్ తో గాయపడిన మల్లాడి శ్రీను ను మంత్రి సుభాష్ పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి తక్షణం స్పందించి బాధిత కుటుంబ సభ్యులతో టెలిఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆపదలో, కష్టకాలంలో ఉన్న తమకు, ఓదార్పు, ధైర్యం చెప్పిన మంత్రి సుభాష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి పండుగ నేపథ్యంలో ప్రజలు మందుగుండు సామాగ్రితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంతోషంగా జరుపుకొనే దీపావళి పండుగ ఒక కుటుంబంలో విషాదం నెలకొల్పడం విచారకరమన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని, దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి సుభాష్ వెంట ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపర్ రింటెండెంట్ శ్రీనివాసన్, సి.ఎస్.ఆర్.ఎమ్.ఓ అనిత, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు, క్వాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య, డాక్టర్ శివకుమార్, హెల్త్ ఇన్స్పెక్టర్ సువర్ణ రాజు తదితరులు ఉన్నారు.

## పవర్ మిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ

◆ తంగిరాల సౌమ్య చేతులమీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

◆ ప్రతిఒక్కరూ ఉజ్వల భవిష్యత్తుకు కష్టపడి చదవాలి

నందిగామ (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉచితంగా 3500 నోటు పుస్తకాలును పవర్ మిక్ సంస్థ హైదరాబాదు వారు అందించడం పట్ల నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నాడు నందిగామ పట్టణం స్థానిక కాకాని నగర్ కార్యాలయంలో పవర్ మిక్ సంస్థ వారు అందించిన 3500 నోటు పుస్తకాలను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలు వారు అందించే ఈ సహకారంతోపాటు పిల్లలు కూడా బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. భవిష్యత్తులో కూడా మరింతమంది పేద పిల్లలను పవర్ మిక్ సంస్థ



ఫౌండేషన్ ఆదుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ఉజ్వల భవిష్యత్తుకు కష్టపడి చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కానర్ ద్వారా లక్ష రూపాయలు స్థానిక నేతలతో పాటు పౌరమిక్ సంస్థ ప్రతినిధులు వాసిరెడ్డి శ్రీనివాస్, శిరీష, గిరి తదితరులు పాల్గొన్నారు.



## ఇళ్లు కూల్చరు.. ధైర్యంగా ఉండాలి

◆ ఎంపి శివనాథ్‌ను కలిసిన గొల్లపూడి పాత రైల్వే కట్ట వాసులు

విజయవాడ (చైతన్యరథం): గొల్లపూడి ప్రాంతంలో రామరాజు నగర్, పాత రైల్వే కట్ట దగ్గర నివాసం ఉంటున్న తమ ఇళ్లు రైల్వే అధికారులు తొలగించకుండా చూడాలని ఆ ప్రాంత నివాసితులు పదుల సంఖ్యలో మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి వారి బాధ వెల్లబోసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ఎవరికీ అన్యాయం జరగదని పాత రైల్వే కట్ట నివాసితులకు ఎంపి కేశినేని శివనాథ్ అభయం ఇచ్చారు. రామరాజునగర్ స్వయంగా వచ్చి అక్కడ పరిస్థితిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని... ఆ తర్వాత శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఎవరు అధైర్య పడవొద్దని... ధైర్యంగా వుండాలని ఎవరి ఇళ్లు కూల్చరని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాలకృష్ణ, గొల్లపూడి మండలం మాజీ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, మండల మాజీ ఎంపీపీ జగన్ మోహన్, నివాసితులు మురళీకృష్ణ, మన్ బోల్, రాజా, భాస్కర్, యల్లాయమ్మ, రాహేలమ్మలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం

◆ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

వేమూరు, (చైతన్యరథం): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరమని వేమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకం అమలు చేస్తున్నారని అన్నారు. మంగళవారం చుండూరు మండలం పెదగాదెలవర్రు గ్రామానికి చెందిన దాసరి హేమావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సర్జరీకి అవసరమైన వైద్య ఖర్చుల నిమిత్తం ఇటీవల ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సీఎమ్ రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితురాలికి సాయం చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాశారు. స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని



అందించారు. అందుకు సంబంధించిన చెక్ ను మంగళవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధితులకు అందజేశారు.



## పేద ప్రజలందరికీ ఉచిత సేవలు.. అదే నారా లోకేష్ ఆరోగ్యరక్ష లక్ష్యం

◆ మరో హెల్త్ క్యాంపును ప్రారంభించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో గొల్లకందుకూరు, సజ్జాపురం గ్రామాలలో నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాధి నిర్ధారణ అనంతరం ఆరోగ్యశ్రీ లేదా ఆరోగ్యశ్రీ వర్తించకుంటే హాస్పిటల్ యాజమాన్యం, దాతల సహకారంతో వారికి పూర్తి స్థాయిలో ఉచితంగా వైద్యం అందిస్తామని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో కూడా నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ స్థానిక నాయకుల, కార్యకర్తల సహకారంతో నిర్వహిస్తామని, ఆరోగ్య రక్ష కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్న మెడికోవర్ హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్లకు, సిబ్బందికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆరోగ్య రక్ష హెల్త్ క్యాంపులో మంగళవారం దాదాపుగా 321 మంది వచ్చి వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వాళ్లకు రవాణా సౌకర్యం, భోజన సదుపాయం కల్పించి హాస్పిటల్ లో వైద్యం చేయించి వారిని తిరిగి సురక్షితంగా వారి ప్రాంతానికి చేరుస్తున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. పేదలు ఈ హెల్త్ క్యాంపులను ఉపయోగించుకోవాలని వారు కోరారు.

## 1న ఇచ్ఛాపురంలో సీఎం పర్యటన

◆ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నవంబరు 1న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సభా వేదిక, హెలిప్యాడ్ కోసం అధికారులు గత సోమవారం స్థల పరిశీలన చేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియోజకవర్గంలో పర్యటించారు. సోంపేట మండలం కొర్లాం పంచాయతీ గొనకపాడు, బారువ రైల్వే గేట్ సమీపంలోని స్థలాలను పరిశీలించారు. కంచిలి మండలం పద్మతుల గ్రామ సమీపంలో స్థలాన్ని కూడా పరిశీలన చేశారు. వీటితోపాటు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం వద్ద స్థలాన్ని పరిశీలించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### త్వరలోనే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు శంకుస్థాపన

◆ వెల్లడించిన విజయనగరం ఎంపీ కలిశెట్టి

అమరావతి (చైతన్యరథం): విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన జరగనుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. ఇప్పటికే భూమి కేటాయింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. త్వరలోనే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. రైల్వే జోన్ ఏర్పాటు అయితే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఈ మేరకు విజయవాడలో ఆయన మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయని అన్నారు. ఇందుకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. భోగాపురం విమానాశ్రయంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. వచ్చే ఏడాది మే నెల నాటికి భోగాపురంలో విమానాలు ల్యాండయ్యే అవకాశం ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు.



# ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేదం పట్ల మక్కువ

**◆ఈ దీపావళి చారిత్రాత్మకం**

**◆ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేదం పట్ల ఆకర్షితులవుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ధన్వంతరి జయంతి, 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో రూ.12,850 కోట్ల విలువైన పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధానిని కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, మన్సుఖ్ మాండవీయ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈరోజు దేశం ధన్‌తేరస్ పండుగ, ధన్వంతరి జయంతి వేడుకలు జరుపుకుంటోందన్నారు. ధన త్రయోదశి, భగవాన్ ధన్వంతరి జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సమయంలో ప్రజలంతా తమ ఇంటికి కావాల్సిన కొత్త వస్తువులను కొనుగోలు చేస్తారన్నారు. ప్రస్తుతం 150కి పైగా దేశాల్లో ఆయుర్వేద దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేదం పట్ల ఆకర్షితులవుతున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు.

దేశంలోని వ్యాపారవేత్తలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఈ దీపావళి చారిత్రాత్మకమన్న ఆయన.. దాదాపు



500 ఏళ్ల తర్వాత మళ్లీ మరో అద్భుతమైన సందర్భం వచ్చిందన్నారు. అయోధ్యలోని రామ్‌లల్లా జన్మస్థలంలో నిర్మించిన ఆలయంలోనూ లక్షలాది దీపాలను వెగిలించనున్నట్లు పేర్కొన్నారు. ఇదో అద్భుత వేడుకగా నిలువనుందన్నారు. 500 ఏళ్ల తర్వాత ఈసారి ఈ నిరీక్షణ ఫలించిందన్నారు.

### వృద్ధులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా ప్రారంభించిన ప్రధాని మోదీ

పేద, ధనిక తారతమ్యం లేకుండా దేశ వ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద దే సందర్భంగా ఈ పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ-విన్ పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.

దేశవ్యాప్తంగా అరు కోట్లమంది సీనియర్ సిటిజన్లకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందుతారు. అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్యబీమా లభిస్తుంది. దీని కింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్ల పైబడినవారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది. సీజీహెచ్ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ పథకాల కింద ఉన్న వయోవృద్ధులు వాటిని గానీ, ఏబీపీఎంజేఏవైని గానీ ఎంచుకోవచ్చు. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందవచ్చు.

# దీపోత్సవానికి అయోధ్య ముస్తాబు!

**◆28 లక్షల దీపాలతో ప్రపంచ రికార్డుకు సిద్ధం**



అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరం దీపావళి వేడుకలకు ముస్తాబవుతోంది. ఒకేసారి లక్షలాది దీపాలు వెలిగించి ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఏటా దీపావళి పర్వదినానికి ముందు రోజు అయోధ్యలోని సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే గతేడాది ఏకంగా 25 లక్షల దీపాలు ఒకేసారి వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. అయితే ఈ ఏడాది 28 లక్షల దీపాలతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాలని యూపీ ప్రభుత్వం భావిస్తోంది.

ఇందులో భాగంగానే అక్టోబర్ 30న జరిగే దీపోత్సవ్ వేడుకలకు అయోధ్యా నగరి ముస్తాబవుతోంది. సరయూ నదీ తీరంలో దీపోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 51 ఘాట్‌లలో ఒకేసారి 28 లక్షల దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మంది వాలంటీర్లు ఈ దీపోత్సవం కార్యక్రమంలో భాగం కానున్నారు. ఇక రామమందిరం నిర్మాణం తర్వాత తొలిసారి జరుగుతున్న దీపావళి పండుగ కావడంతో ఈ దీపోత్సవాన్ని మరింత అద్భుతంగా నిర్వహించాలని యూపీ సర్కార్ భావిస్తోంది. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. సరయూ హారతి ఇస్తారు. అనంతరం నది ఒడ్డున దీపోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తూ దీపాలను లెక్కించనున్నారు. ఈ దీపోత్సవం అనంతరం లేజర్ షో ఏర్పాటు చేశారు.

## కల్వర్ట్‌ను ఢీకొన్న బస్సు: 12 మంది మృతి

సికార్: రాజస్థాన్‌లోని సీకర్ జిల్లాలో మంగళవారం ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, 40 మందికి పైగా గాయపడ్డారు. సాలాసర్ నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు లక్ష్మణ్‌గఢ్ దాటిన తర్వాత ఒక కల్వర్ట్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగ్రాతులను లక్ష్మణ్‌గఢ్‌లోని ఆసుపత్రిలో చేర్చగా పలువురి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. సాలాసర్ నుంచి వస్తున్న బస్సు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో లక్ష్మణ్‌గఢ్ వద్ద అదుపుతప్పి ఒక కల్వర్ట్‌ను ఢీకొన్నట్టు జిల్లా ఎస్పీ భువన్ భూషణ్ తెలిపారు. 12 మంది ప్రాణాలు కోల్పోగా పెద్ద సంఖ్యలో గాయపడ్డారని, వారిని లక్ష్మణ్‌గఢ్, సీకర్ ఆసుపత్రుల్లో చేర్చామని చెప్పారు. కాగా, ఏడుగురు ప్రయాణికులు లక్ష్మణ్‌గఢ్‌లో మృతి చెందినట్టు ఎస్‌కే ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేంద్ర ఖిచడ్ తెలిపారు. మొత్తం 27 మంది క్షతగాత్రులు తమ ఆసుపత్రికి వచ్చారని, ఇద్దరు మార్గమధ్యంలోనే మృతి చెందగా, చికిత్స అందిస్తుండగా మరో ముగ్గురు ప్రాణాలు కోల్పాయారని తెలిపారు. ఏడుగురు క్షతగాత్రులను తదుపరి చికిత్స కోసం జైపూర్‌కు పంపామని, ప్రస్తుతం 23 మంది తమ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వివరించారు.

### సీఎం సంతాపం

సీకర్ జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు తక్షణ సాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు.



# నిషేధిత డర్గ్స్ ఫ్యాక్టరీ గుట్టు రట్టు

**◆డర్గ్స్ తయారీలో తిహార్ జైలు వార్డెన్ హస్తం**

న్యూఢిల్లీ: నిషేధిత మాదక ద్రవ్యం మెథాంపెటమైన్ (మెథ్) తయారీ ల్యాబ్‌ను ఢిల్లీ ఎన్సీఆర్ పరిధిలో ఎన్సీబీ అధికారులు గుర్తించారు. దీని నిర్వహణ వెనుక ఏకంగా తిహార్ జైలు వార్డెన్ హస్తం కూడా ఉందని తెలుసుకొని నిర్ఘాంతపోయారు. అక్టోబర్ 25వ తేదీన గ్రేటర్ నోయిడా పరిధిలో ఎన్సీబీ దాడులు నిర్వహించింది. ఒక ఇంట్లో నిర్వహిస్తున్న మెథ్ ల్యాబ్‌ను గుర్తించింది. దీనిని తిహార్ జైలు వార్డెన్, ఢిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్త, ముంబయికి చెందిన కెమిస్ట్ నిర్వహిస్తున్నారు.

ఇక్కడ దేశీయ వినియోగానికి, అంతర్జాతీయ ఎగుమతుల కోసం సింథటిక్ డ్రగ్స్‌ను తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘన, ద్రవ రూపాల్లో ఉన్న దాదాపు 95 కిలోల మెథ్‌ను వారు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఫ్యాక్టరీ ఆవరణలో ఎసిటోన్, సోడియం హైడ్రాక్సైడ్, మిథాలిన్ క్లోరైడ్, ప్రీమియం గ్రేడ్ ఎథనాల్, రెడ్ పాస్ఫరస్, ఈథైల్ ఎసిటేట్ వంటివి లభించాయి. తయారీ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న పరికరాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పట్టుబడిన వ్యాపారవేత్తను గతంలో కూడా ఒక ఎన్డీపీఎస్ కేసులో డిపార్ట్మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అరెస్టు చేసింది. ఆ సమయంలో అతడిని తిహార్ జైల్లో ఉంచగా.. అక్కడ వార్డెన్‌తో పరిచయం పెంచుకొని అతడిని కూడా ఈ మత్తు వ్యాపారంలోకి దించాడు. వీరి ఫ్యాక్టరీలో ముంబయికి చెందిన కెమిస్ట్ మాదక ద్రవ్యాలను తయారుచేయగా.. వాటి నాణ్యతను ఢిల్లీలో ఉండే మెక్సికన్ ముఠా సభ్యుడు పరీక్షించేవాడని ఎన్సీబీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో ఎన్సీబీ గుజరాత్‌లోని గాంధీనగర్, అమ్రేలి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, సిరోహి, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ డ్రగ్ ల్యాబ్‌లను కనుగొన్నారు.

# గత ప్రభుత్వం సర్దార్ పటేల్ ఘనతను విస్మరించింది

**◆కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శ**

**◆'ఐక్యతా పరుగు' ప్రారంభించిన అమిత్ షా**

న్యూఢిల్లీ: గతంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీర్తిని తుడిచి పెట్టడానికి, ఆయన వారసత్వాన్ని అణగదొక్కడానికి ప్రయత్నాలు జరిగాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో జెండా ఊపి 'ఐక్యతా పరుగు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం షా మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య పోరాటం అనంతరం పటేల్ చొరవతోనే 550 సంస్థానాలు భారత్‌లో విలీనమై.. దేశం ఏకమైందని పేర్కొన్నారు. జూనాగఢ్., హైదరాబాద్, లక్షదీవులను భారత్‌లో కలిపేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయన్నారు. పటేల్ దేశం కోసం ఎంత చేసినప్పటికీ ఆయనకు భారతరత్న ఇవ్వడానికి గత ప్రభుత్వం చాలాకాలం నిరాకరించిందని విమర్శించారు.

సర్దార్ పటేల్ 1950లో మరణించారని, ఆయన మరణించిన 41



సంవత్సరాల తర్వాత 1991లో ఆయనకు భారతరత్న పురస్కారాన్ని అందించారని అమిత్ షా పేర్కొన్నారు. అయితే ప్రధాని మోదీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కెవాడియాలో ప్రపంచంలోనే అత్యంత 'ఎత్తైన పటేల్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, సముచిత రీతిలో సత్కరించారని అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటివరకు దేశ ప్రజలు ఎంతో ఐక్యంగా ఉన్నారన్నారు. 2047 నాటికి భారత్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా, ప్రపంచంలోనే అగ్రగామిగా మార్చేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతిఏటా పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31ని 'రాష్ట్రీయ ఏక్తా దివస్'గా జరుపుకుంటోందని.. ఇందులో భాగంగా 'రన్ ఫర్ యూనిటీని నిర్వహిస్తామని.. అయితే ఈ ఏడాది అదే తేదీలో దీపావళి పండగ ఉన్నందున రెండు రోజులు ముందుగానే నిర్వహించినట్లు వెల్లడించారు.

ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహంగా గుజరాత్‌లోని సర్దార్ పటేల్ విగ్రహం చరిత్ర సృష్టించింది. దీని ఎత్తు 507 అడుగులు. ఇది గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో, ఆ తర్వాత భారత ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు పటేల్ చేసిన కృషికి స్మృతిగా దీనిని నిర్మించారు. 180 కి. మీ వేగంతో గాలులు వీచినా... రెక్టార్ స్కేలుపై 6.5 తీవ్రతతో భూకంపం వచ్చినా తట్టుకునేలా విగ్రహాన్ని నిర్మించారు. గత వందేళ్లలో గరిష్టంగా వచ్చిన వరద ముప్పును అంచనా వేసి.. దానిని తట్టుకునేలా పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.